# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 92 | పేజీలు : 08 | గురువారం | 09-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.




## మా ప్రభుత్వానికేం సంబంధం

**నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై హరీశ్ రావుకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్**

**బీఆర్ఎస్ హయాంలోనే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరిగిందన్న మంత్రి**

2

**హరీశ్ రావు చెబుతోన్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభమైనట్లు వెల్లడి**

**ఇది ప్రభుత్వ భూమి అని కేసీఆర్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేయలేదన్న మంత్రి**

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

నాదర్‌గుల్‌లో భూములను 2014లోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంస్థలకు అప్పగించిందని, వారి హయాంలోనే ఆ సంస్థల పేరిట రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కూడా జరిగిందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. నాడు జరిగిన రిజిస్ట్రేషన్‌తో తమ ప్రభుత్వానికేం సంబంధమని మండిపడ్డారు. నాదర్‌గుల్ భూములను తమ ప్రభుత్వం హయాంలో కట్టబెట్టినట్లు ఆరోపణలు చేయడాన్ని ఆయన ఖండించారు.హరీశ్ రావు చెబుతోన్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఆ సమయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉందని గుర్తు చేశారు. తమకు నాలా కన్వర్షన్ ఇవ్వలేదని భూములు పొందినవారు 2022లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తే, నాటి కేసీఆర్ ప్రభుత్వం కనీసం కౌంటర్ దాఖలు చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఆ భూములు ప్రభుత్వానివేనని కౌంటర్ దాఖలు చేశామని వెల్లడించారు.నాడు వాటాల కోసం భూములు కట్టబెట్టిన వారు ఇప్పుడు తమపై నిందలు మోపుతున్నారని ఆగ్రహం

# ఎన్నికలకు సర్వం సిద్ధం

**అసోం, కేరళ, పుదుచ్చేరి ఎన్నికలకు సర్వం సిద్ధం**

**అసోం అసెంబ్లీలోని 126 స్థానాలకు గురువారం జరగనున్న పోలింగ్**

**శాసనసభ ఎన్నికలకు సిద్ధమైన కేరళ**

**140 స్థానాల్లో బరిలో నిలిచిన 883 అభ్యర్థులు**

**పుదుచ్చేరిలోనూ ఎన్నికలకు ఈసీ ఏర్పాట్లు**

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

కేరళ, పుదుచ్చేరి, అసోంలో అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. గురువారం ఎన్నికలు జరగనున్న అసెంబ్లీ స్థానాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపింది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం 76 వేల మంది పోలీసు, కేంద్ర బలగాలను మోహరించినట్లు పేర్కొంది. వేసవి తీవ్రత దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పింది.

**ఎన్నికల బరిలో నిలిచిన 722 మంది అభ్యర్థులు**

అసోం అసెంబ్లీలోని 126 స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. మొత్తం 35 జిల్లాల్లో 31 వేల 490 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ జరగనుంది. మొత్తం 126 నియోజకవర్గాల్లో బరిలో నిచిలిన 722 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మొత్తం అభ్యర్థుల్లో కేవలం 59 మంది మాత్రమే మహిళలు ఉండటం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 99 స్థానాల్లో, బీజేపీ 90 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 2.5 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారిలో 1.25 కోట్ల మంది మహిళలు ఉన్నారు. 6.42 లక్షల మంది తొలిసారి ఓటు వేయనున్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ఎన్నికల సంఘం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడం సహా కేంద్ర సాయుధ బలగాలను భారీగా మోహరించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. గతంలో పలు విడతలుగా జరిగిన ఎన్నికలకు భిన్నంగా, ఈసారి అసోంలో కేవలం ఒకే దశలో పోలింగ్ జరగనుంది.

**30,495 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఈసీ**

శాసనసభ ఎన్నికలకు కేరళ సిద్ధమైంది. గురువారం ఎన్నికలు జరగనున్న 140 అసెంబ్లీ స్థానాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఈ ఎన్నికల్లో 883 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 2.71 కోట్ల మంది ఓటర్లు తేల్చనున్నారు. ఇందులో 1.32 కోట్ల మంది పురుషులు, 1.39 కోట్ల మంది మహిళలు, 273 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అటు దాదాపు 2.42 లక్షల మందికి పైగా విదేశీ ఓటర్లు ఉన్నారని ఎన్నికల సంఘం తెలిపింది. కేరళలో ఓటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు 30 వేల 495 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పలుచోట్ల ఓటర్ల సౌకర్యార్థం అదనపు పోలింగ్ బూత్‌లను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సుమారు 1.46 లక్షల

## బెంగాల్‌లో లక్షలాది ముస్లిం ఓట్లను న్యాయపరిశీలనలో ఉంచారు: అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం

**పలు నియోజకవర్గాల్లో 50 శాతానికి పైగా ఓట్లు న్యాయపరిశీలనలో..!**

2

**ముస్లింల పేర్లను న్యాయపరిశీలనలో ఉంచారని అసదుద్దీన్ మండిపాటు**

**ఎన్నికల లోపు వారి ఓటుపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్**



## వచ్చే ఏడాది నా పాదయాత్ర

2

**చంద్రబాబుకు రోజుకో సినిమా చూపిస్తాం: జగన్**

**దోచుకో.. పంచుకో.. తినుకో సిద్ధాంతంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్న జగన్**

**రెండేళ్లలో చంద్రబాబు రూ. 3.52 లక్షల కోట్ల అప్పు చేశారని ఆరోపణ**

**గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని మడిపాటు**

## ఘోరమైన గులాంగిరి చేస్తోంది

**రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేస్తోంది**

**కొత్త రాజకీయాలను పరిచయం చేస్తా..**

**ప్రజల కోసం అద్భుతమైన అజెండా రూపొందిస్తా..**

**రాహుల్ గాంధీ ఫోన్ చేస్తే ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా రేవంత్‌రెడ్డి నిలబడే మాట్లాడుతున్నారు**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

2



## అమెరికా, ఇరాన్ కాల్పుల విరమణ

స్పందించిన భారత్



2

**ఒప్పందాన్ని స్వాగతించిన భారత్**

**పశ్చిమాసియాలో శాంతి నెలకొంటుందని ఆశిస్తున్నట్లు వెల్లడి**

**ఈ సంఘర్షణ వల్ల ప్రపంచ ప్రజలు ఎంతో ఇబ్బందికర పరిణామాలు ఎదుర్కొన్నారన్న భారత్**

## మెట్రో రైల్ ఎక్కిన జూపల్లి

**మియాపూర్ వరకు మెట్రో రైల్లో ప్రయాణించిన మంత్రి జూపల్లి**

**ఎర్రమంజిల్ స్టేషన్‌లో మెట్రో రైల్ ఎక్కిన జూపల్లి**

**తోటి ప్రయాణికులతో కలిసి నిలబడే ప్రయాణించిన మంత్రి**

**అందరితో ఓపికగా ఫొటోలు దిగిన జూపల్లి**

2



## మా దేశం వెళ్లిపోతాం...

విశాఖలో డీఆర్వోను ఆశ్రయించిన ఇరాన్ యువతులు

**పశ్చిమాసియా యుద్ధంతో విశాఖలోని ఇరాన్ యువతుల్లో ఆందోళన**

**తమ కుటుంబాలతో సంబంధాలు తెగిపోయాయని ఆవేదన**

**తమను ఇరాన్‌కు పంపాలని కలెక్టరేట్ అధికారులకు విజ్ఞప్తి**

**విశాఖలో డీఫార్మసీ చదువుతున్న ఇరాన్ యువతులు**

2



## యుద్ధం చాలు అని ఇరాన్‌కు అనిపించింది

**ప్రపంచ శాంతికి ఇది గొప్ప రోజన్న ట్రంప్**

**టెహ్రాన్ పునర్నిర్మాణాన్ని ప్రారంభించుకోవచ్చన్న ట్రంప్**

**ప్రపంచ దేశాలు యుద్ధం ఆగిపోవాలని కోరుకున్నాయన్న ట్రంప్**

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఇరాన్, అమెరికా దేశాలు రెండు వారాల పాటు కాల్పుల విరమణకు అంగీకరించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. ప్రపంచ శాంతికి ఇది గొప్పరోజని వ్యాఖ్యానించారు. పశ్చిమాసియాలో ఇది సువర్ణాధ్యాయం కాబోతోందని పేర్కొన్నారు. ఇరాన్‌కు ఇక చాలు అనిపించిందని యుద్ధాన్ని ఉద్దేశించి అన్నారు. టెహ్రాన్ పునర్నిర్మాణాన్ని ప్రారంభించుకోవచ్చని సూచించారు.ప్రపంచ దేశాలు యుద్ధం ఆగిపోవాలని కోరుకున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని



2

## బహిరంగసభకు అనుమతుల రద్దు

**హరీశ్ రావు బహిరంగసభకు అనుమతుల రద్దు**

**గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా రైతుల నిరసన**

**రైతులకు మద్దతుగా హరీశ్ రావు బహిరంగ సభ**

**సభకు తొలుత అనుమతి ఇచ్చి, తాజాగా రద్దు చేసిన ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయిస్తామన్న నిరంజన్ రెడ్డి**

2



# వచ్చే ఏడాది నా పాదయాత్ర

**మొదటి పేజీ రువాయి**

కూటమి ప్రభుత్వం "దోచుకో.. పంచుకో.. తినుకో.." అనే సిద్ధాంతంతో పాలిస్తోందని వైసీపీ అధినేత జగన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన చంద్రబాబు పాలనా తీరును ఎండగట్టారు. వచ్చే ఏడాది తాను పాదయాత్ర ప్రారంభిస్తానని, అప్పటి నుంచి చంద్రబాబుకు ప్రతిరోజూ సినిమా చూపిస్తామని జగన్ హెచ్చరించారు. గత ప్రభుత్వంలో తాము చేసిన అప్పుల్లో మెజారిటీ వాటా (రూ. 2.73 లక్షల కోట్లు) నేరుగా డీబీటీ ద్వారా ప్రజల ఖాతాల్లోకి చేరిందని తెలిపారు. చంద్రబాబు ఈ రెండేళ్లలోనే రూ. 3.52 లక్షల కోట్ల అప్పు చేశారని... ఈ నిధులన్నీ ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు చెత్తబుట్టలోకి వెళ్లాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రగతిని తిరోగమనంలోకి నెట్టారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు.

# మా దేశం వెళ్లిపోతాం...

**మొదటి పేజీ రువాయి**

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం విశాఖపట్నంలో చదువుకుంటున్న ఇరాన్ విద్యార్థినులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. తమ దేశంలోని కుటుంబ సభ్యులతో సంబంధాలు పూర్తిగా తెగిపోవడంతో, వారి సమాచారం తెలియక తీవ్ర ఆవేదన చెందుతున్నారు. తమను సురక్షితంగా స్వదేశానికి పంపేందుకు సహాయం చేయాలని కోరుతూ వారు విశాఖ జిల్లా అధికారులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే, విశాఖ నగరంలో డీఫార్మసీ చదువుతున్న కొందరు ఇరాన్ యువతులు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) విశ్వేశ్వరనాయుడిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. యుద్ధం కారణంగా ఇరాన్‌లోని తమ కుటుంబాలతో మాట్లాడలేకపోతున్నామని, వారి యోగక్షేమాల గురించి సమాచారం తెలియక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నామని వివరించారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తాము ఇక్కడ ఉండలేమని, తమను వీలైనంత త్వరగా తిరిగి ఇరాన్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేయాలని వారు అధికారులను వేడుకున్నారు. విద్యార్థినుల విజ్ఞప్తిని స్వీకరించిన అధికారులు, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

# అమెరికా, ఇరాన్ కాల్పుల విరమణ

**మొదటి పేజీ రువాయి**

అమెరికా, ఇరాన్ దేశాల మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. దీనిపై భారత్ స్పందించింది. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తున్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇరుదేశాల నిర్ణయంతో పశ్చిమాసియాలో శాంతి నెలకొంటుందని ఆశిస్తున్నట్లు 'ఎక్స్' వేదికగా పేర్కొంది. "కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఇది పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి దారి తీస్తుందని ఆశిస్తున్నాం. ఉద్రిక్తతలు తగ్గించడం కోసం దౌత్యపరమైన చర్చలు అవసరమని భారత్ మొదటి నుంచి చెబుతోంది. ఈ సంఘర్షణ ప్రపంచ దేశాలకు, ప్రజలకు ఇప్పటికే ఎంతో ఇబ్బందికర పరిణామాలను కలిగించింది" అన్నారు. పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితులు ప్రపంచ ఇంధన సరఫరా, వాణిజ్య నెట్‌వర్క్‌లపై తీవ్ర ప్రభావం చూపించాయని పేర్కొంది. యుద్ధ విరమణ నేపథ్యంలో హార్మూజ్ జలసంధి గుండా నౌకాయానం స్వేచ్ఛగా కొనసాగుతుందని ఆశిస్తున్నట్లు భారత్ పేర్కొంది.

# మా ప్రభుత్వానికేం సంబంధం

**మొదటి పేజీ రువాయి**

వ్యక్తం చేశారు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరూ లేరని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నాదర్‌గుల్ భూముల వ్యవహారానికి సంబంధించిన కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు. కాగా, నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై ఇటీవల రాజకీయ దుమారం చెలరేగుతోంది. రూ.7 వేల కోట్ల విలువైన 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టిందని హరీశ్ రావు ఆరోపిస్తున్నారు. అయితే ఈ భూమి యజమాని ఏక్యూ రియాల్టర్ అని చెబుతున్నారు. ఇది ప్రైవేటు భూమి అని హైకోర్టు, సుప్రీంకోర్టు గుర్తించాయని ఏక్యూ రియాల్టర్ అడ్వకేట్ ఇటీవల తెలిపారు.

# మెట్రో రైల్ ఎక్కిన జూపల్లి

**మొదటి పేజీ రువాయి**

తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఎటువంటి హంగూ ఆర్భాటాలు లేకుండా, ఒక సామాన్య ప్రయాణికుడిలా మెట్రోలో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. నగరంలోని ఒక ప్రైవేట్ కార్యక్రమానికి వెళ్లాల్సి ఉండగా, ట్రాఫిక్ ఇబ్బందులను దాటుకుని త్వరగా చేరుకోవడానికి మంత్రి మెట్రోను ఎంచుకున్నారు. సెక్యూరిటీ హడావుడి లేకుండా ఎర్రమంజిల్ స్టేషన్‌లో స్వయంగా టికెట్ కొనుగోలు చేసి మియాపూర్ వరకు ప్రయాణించారు. రైలులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో, మంత్రి తన హోదాను పక్కన పెట్టి తోటి ప్రయాణికులతో కలిసి నిలబడే వెళ్లారు. ప్రయాణ సమయంలో తోటి ప్రయాణికులతో సరదాగా మాట్లాడారు. మెట్రో సౌకర్యాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రిని తమ మధ్య చూసిన ప్రయాణికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపగా, జూపల్లి ఎంతో ఓపికగా అందరితో ఫొటోలు దిగారు. సమయాన్ని ఆదా చేస్తూ, ట్రాఫిక్ చిక్కులు లేకుండా గమ్యస్థానాలకు చేరడానికి మెట్రో ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. గతంలోనూ ఆయన ఎల్బీ నగర్ నుంచి కేపీహెచ్?బీ వరకు ఇలాగే ప్రయాణించి వార్తల్లో నిలిచారు.

# బహిరంగసభకు అనుమతుల రద్దు

**మొదటి పేజీ రువాయి**

వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా గత 100 రోజులుగా సాగుతున్న రైతుల పోరాటం ఉద్రిక్తంగా మారింది. రైతులకు మద్దతుగా ఈ నెల 9న నిర్వహించాలనుకున్న హరీశ్‌రావు బహిరంగ సభకు ప్రభుత్వం అకస్మాత్తుగా అనుమతులు రద్దు చేయడం రాజకీయ దుమారానికి దారితీసింది. ప్రభుత్వం తొలుత అనుమతినిచ్చి, సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాక వెనక్కి తగ్గడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకను నొక్కేయాలని చూడటం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా, తాము వెనక్కి తగ్గేది లేదని, హైకోర్టును ఆశ్రయించి సభకు అనుమతులు తెచ్చుకుంటామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమాలు, కేసులు కొత్త కాదని... బెదిరింపులకు భయపడి ఉంటే తెలంగాణ వచ్చేదే కాదని నిరంజన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రైతాంగ ప్రయోజనాల కోసం తమ పోరాటం కొనసాగుతుందని, ఈ నెల 9న హరీశ్‌రావు సభను జరిపి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# యుద్ధం చాలు అని ఇరాన్‌కు అనిపించింది

**మొదటి పేజీ రువాయి**

పునరుద్ధరించేందుకు అమెరికా సహాయం చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ జలసంధి మీదుగా అంతా సజావుగా సాగేందుకు అమెరికా బలాలు అక్కడ ఉంటాయని స్పష్టం చేశారు. సానుకూల చర్యలు చేపట్టి వాణిజ్యపరంగా ముందడుగు వేయడానికి ఇది గొప్ప అవకాశమని పేర్కొన్నారు. అన్నీ సవ్యంగా జరగడానికి అమెరికా తప్పకుండా మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. అమెరికా మాదిరి ఇరాన్‌కు కూడా మంచి రోజులు రానున్నాయని అన్నారు. యుద్ధానికి తాత్కాలిక విరామం ప్రకటించిన వెంటనే కూడా ట్రంప్ ఓ పోస్టు పెట్టారు. తమ సైనిక లక్ష్యాలు నెరవేరాయని, ఇరాన్‌తో దీర్ఘకాలిక శాంతి కోసం ఇది ఒక ముందడుగని పేర్కొన్నారు.

**యుద్ధ విరమణలో చైనా పాత్రపై ట్రంప్ ఏమన్నారంటే..!**

ఇరాన్, అమెరికా కాల్పుల విరమణలో చైనా పాత్ర ఉన్నట్లుగా తెలుస్తోంది. "ఇరాన్ కాల్పుల విరమణపై చర్చలకు ఒప్పించడంలో చైనా ప్రమేయం ఉందా?" అని మీడియా ప్రతినిధులు ట్రంప్‌ను ప్రశ్నించారు. దానికి ఆయన, అది నేను కూడా విన్నానని, అందులో వాస్తవం ఉందనే అనుకుంటున్నానని సమాధానమిచ్చారు.

# ఎన్నికలకు సర్వం సిద్ధం

**మొదటి పేజీ రువాయి**

మంది అధికారులు విధుల్లో ఉన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం 76 వేల మంది పోలీసు, కేంద్ర బలగాలను మోహరించినట్టు ఈసీ తెలిపింది. వేసవి తీవ్రత దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. కాగా, ఈ ఎన్నికల్లో ప్రధానంగా ఎాణఖీ, ఖణఖీ, చీణూ కూటముల మధ్య పోటీ నెలకొంది.

**బరిలో 294 మంది అభ్యర్థులు**

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో 30 స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ జరగనుంది. ఎన్నికల కోసం 1,099 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పుదుచ్చేరి, కారైకల్, మాహే, యానాం ప్రాంతాలలో కలిపి అసెంబ్లీలో ముప్పై సీట్లకు 294 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే, ప్రధానంగా ఎన్?డీఏ-ఇండియా కూటమికి మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ మొత్తం 9,48,977 మంది ఓటర్లు ఉండగా, అందులో 4,45,761 మంది పురుషులు, 5,03,076 మంది మహిళలు, 140 మంది ట్రాన్స్?జెండర్లు ఉన్నారు.

**మే 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాలు**

ప్రస్తుతం 5 రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తొలి విడతలో కేరళ, పుదుచ్చేరి, అసోంలో ఏప్రిల్ 9న ఎన్నికలు నిర్వహించనుండగా తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగుతుంది. ఇక బంగాల్‌లో 2 విడతలుగా ఓటింగ్ జరగనుంది. తొలి విడత ఏప్రిల్ 23న, రెండో విడత 29న నిర్వహించనున్నారు. ఎన్నికల ఫలితాలను మే 4న వెలువడనున్నాయి.

# ఘోరమైన గులాంగిరి చేస్తోంది

**మొదటి పేజీ రువాయి**

హైదరాబాద్, ఏప్రిల్ 8: దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చిన సరే కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేస్తే ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా రేవంత్‌రెడ్డి నిలబడే మాట్లాడుతున్నారని.. లేదంటే తన కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనని భయపడుతున్నారని సెటైర్లు గుప్పించారు. బుధవారం తెలంగాణ జాగృతిలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు చేరారు. కండువా కప్పి జాగృతిలోకి కవిత ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు.

కొత్త రాజకీయాలను పరిచయం చేస్తా.. రాసి పెట్టుకోండి.. తెలంగాణ భవిష్యత్, చరిత్రను మార్చే రోజు ఏప్రిల్ 25 అవుతోందని కవిత ఉద్ఘాటించారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయాలను ఈ గడ్డకు పరిచయం చేస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తాం, పోరాడుతాం, పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు. పప్పన్నం తింటాం, ప్రజల మధ్యలో ఉంటామని.. వారితోనే కలిసి పనిచేస్తామని మాటిచ్చారు. సామాన్యులతో, సామాన్యుల కోసం, సామాన్యులే ఉండేలా రాజకీయం తెస్తామని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అధికార పక్షం కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యల గురించి ప్రశ్నించేదెవరు అంటే ప్రతినోట జాగృతియే అనే మాట వస్తోందని చెప్పారు.

ప్రజల కోసం అద్భుతమైన అజెండా రూపొందిస్తా..

ప్రజల సమస్యల గురించి కాంగ్రెస్ హైకమాండ్‌ని పైసలు అడిగితే నో రాహుల్ జీ అని రేవంత్‌రెడ్డికి సమాధానం చెబుతున్నారని అన్నారు. కానీ కేరళ ఎన్నికల కోసం ఎంత ఖర్చయినా పెడుతున్నారని విమర్శించారు. అప్పర్ తుంగభద్రకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇస్తే రేవంత్‌రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. జాతీయ హోదా కారణంగా తుంగభద్రకు నీళ్లు రాక నష్టపోయేది ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాయేనని.. కానీ ఈ విషయంలో రేవంత్‌రెడ్డి ఎందుకు మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని నిలదీశారు. అటు కాంగ్రెస్‌ను, ఇటు బీజేపీని మెయింటెయిన్ చేస్తూ ప్రజలను మాత్రం మోసం చేస్తున్నారని ఆగ్రహించారు. తెలంగాణ జాగృతి తరఫున వచ్చే పార్టీ.. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తుందని భరోసా కల్పించారు. అంతర్జాతీయ స్థాయిలో నిపుణులతో సమావేశమై ప్రజల కోసం అద్భుతమైన అజెండా రూపొందిస్తున్నానని చెప్పుకొచ్చారు. కొత్త తరహా రాజకీయాలు, ప్రజల కోసం మంచి చేసే రాజకీయాలు ఎలా ఉంటాయో చూపిస్తామని కవిత పేర్కొన్నారు.

# బెంగాల్‌లో లక్షలాది ముస్లిం ఓట్లను న్యాయపరిశీలనలో ఉంచారు: అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం

**మొదటి పేజీ రువాయి**



పశ్చిమ బెంగాల్‌లో ఆయా నియోజకవర్గాల్లో పెద్ద మొత్తంలో ముస్లింల పేర్లను న్యాయ పరిశీలన జాబితాలో ఉంచడంపై మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంషేర్‌గంజ్ నియోజకవర్గంలో 55 శాతం మంది ముస్లింలు, మోతాబరిలో 54.2 శాతం, మణిక్‌చక్‌లో 50 శాతం, బెర్హంపూర్‌లో 61.6 శాతం మంది ముస్లింల పేర్లు పరిశీలన జాబితాలో నిలిచిపోయాయని ఆరోపించారు. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో లక్షలాది మంది ముస్లింల ఓటు హక్కును ప్రశ్నార్థకంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి ఓటు హక్కు విషయమై 'ఫారెనర్స్ ట్రైబ్యునల్' ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. ఆ నిర్ణయం వెలువడే వరకు వారు ఓటు వేయలేరని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల లోపు 'ఫారెనర్స్ ట్రైబ్యునల్' సభ్యులను ఏర్పాటు చేసి త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని కోరారు. తమ పేర్లు గల్లంతయ్యాయని లక్షలాది మంది ఓటర్లు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఎన్నికలకు ముందే నిర్ణయం తీసుకోవడం ద్వారా అందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

# ప్రతి గర్భిణికి సమయానుకూల పరీక్షలు - ఆరోగ్యకరమైన భవిష్యత్తు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, సంగారెడ్డి ప్రతినిధి:**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో "సేఫ్ మదర్ డే" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు అవసరమైన ఆరోగ్య సేవలు, ఏఎన్‌సీ పరీక్షల ప్రాముఖ్యత, మాతృ మరణాల తగ్గింపు, సిజేరియన్ ప్రసవాలు, హై రిస్క్ గర్భధారణలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పీసీపీఎన్‌డీటీ చట్టంపై డాక్టర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సురక్షిత మాతృత్వంతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని తెలిపారు. తల్లి--బిడ్డల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అన్ని రకాల వైద్య సదుపాయాలను అందిస్తున్నదని, గర్భధారణ ప్రారంభం నుంచే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. వైద్యుల సూచనలు పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన శిశువు జన్మిస్తుందని, చిన్న వయసులో గర్భధారణ వల్ల సమస్యలు తలెత్తే అవకాశమున్నందున మైనర్ బాలికల వివాహాలను అరికట్టడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సురక్షిత ప్రసవాలు, తల్లి--శిశు ఆరోగ్య పరిరక్షణలో వైద్య సిబ్బంది సమన్వయం ఎంతో ముఖ్యమని తెలిపారు. గర్భధారణ సమయంలో సమయానికి పరీక్షలు, టీకాలు, సరైన పోషకాహారం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడవచ్చని అన్నారు. సమగ్ర ప్రణాళికతో పనిచేసి మాతృ మరణాల రేటును పూర్తిగా తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. కొత్తగా తల్లులైన మహిళలకు అవసరమైన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలని, ఆశా, ఏఎన్‌ఎంల ద్వారా గ్రామ స్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహించి గర్భిణీలకు పూర్తి సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాతా--శిశు ఆరోగ్య పరిరక్షణ, సురక్షిత ప్రసవాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి సేఫ్ మదర్ హుడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వసంత్ రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. మురళీకృష్ణ, డీసీహెచ్‌ఎస్ డా. కవిత, ప్రోగ్రాం అధికారులు, వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, గర్భిణీలు పాల్గొన్నారు.

# ఇస్కాన్ సైబరాబాద్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్య ఉచిత బ్రేక్ ఫాస్ట్ సేవ ప్రారంభం

**ట్రస్ట్ సేవలు అమోఘం, పేదల ఆకలి తీర్చడమే వీరి ధ్యేయం**
**గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**




**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 08, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
ఇస్కాన్ సైబరాబాద్ ట్రస్ట్ పేదల ఆకలి తీర్చడమే వీరి ధ్యేయమనీ గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు. గోపనపల్లి లోని రంగనాథ స్వామి ఆలయం పక్కన గల ఇస్కాన్ సైబరాబాద్ టెంపుల్ వద్ద ఏర్పాటు చేసిన నిత్య బ్రేక్ ఫాస్ట్ సేవ ను బుధవారం నాడు గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడమే ఈ ట్రస్ట్ ప్రధాన ధ్యేయమని తెలిపారు. అనేక ప్రాంతాల్లో అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ సమాజానికి విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ప్రతిరోజు ఉదయం 09.00 గంటల నుండి 10.30 గంటల వరకు నిర్వహించబడే ఈ ఉచిత బ్రేక్ ఫాస్ట్ సేవ ద్వారా భక్తులు, స్థానిక ప్రజలు మరియు అవసరమైన వారికి పోషకాహారం అందించబడుతుంది అన్ని తెలిపారు. భవిష్యత్తులో ఈ సేవలను మరింత విస్తరించి ఎక్కువ మందికి చేరవేసేలా చర్యలు తీసుకుంటామని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఈ ఉచిత బ్రేక్ ఫాస్ట్ వల్ల అనేకమంది ఆకలి బాధలు తీరుతాయని, అందుకు వీరిని అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఈ సేవలను వినియోగించుకుని ట్రస్ట్ కార్యకలాపాలకు సహకరించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు, స్థానిక నేతలు కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

# స్టెల్లా మేరీస్ యూకేజీ విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**ముఖ్య అధితులుగా పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
బూర్గంపహాడ్ మండల పరిధిలో మొరంపల్లి బంజర్ గ్రామంలో స్థానిక స్టెల్లా మేరీస్ పాఠశాలలో యూకేజీ విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిన్నారులు తమ విద్యలో మొదటి దశను విజయవంతంగా పూర్తి చేసి ఫస్ట్ క్లాస్‌లోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ కార్యక్రమం ప్రత్యేకంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథి పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మాజీ ఉపసర్పంచ్ మాట్లాడుతూ, "పిల్లలు వేసే ఈ చిన్న అడుగులు వారి భవిష్యత్తులో గొప్ప విజయాలకు బాటలు వేస్తాయి. చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు, విలువలు నేర్చుకుంటే వారు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారు. పిల్లలు మీరు గురువులను గౌరవించేవారుగా ఉండాలి గురువులంటే దైవంతో సమానం క్రమశిక్షణ కలిగి చదువుపట్ల శ్రద్ధ కలిగి ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాని తెలిపారు. మరొక అతిథిఫాదర్ క్రీస్తుబాబు తన ప్రసంగంలో, "విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాదు. పిల్లలు ఆటల ద్వారా, అనుభవాల ద్వారా కూడా ఎన్నో నేర్చుకుంటారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పిల్లలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి" అని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సుమలత మాట్లాడుతూ, "మా పాఠశాలలో విద్యతో పాటు నైతిక విలువలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాము. ప్రతి చిన్నారి భవిష్యత్తులో మంచి పౌరుడిగా ఎదగాలని మా లక్ష్యం." తల్లీదండ్రులు ఇంటి వద్ద పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అని తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. పాటలు, నృత్యాలతో తమ ప్రతిభను చూపించారు. అనంతరం ప్రతి విద్యార్థికి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్‌లు ముఖ్య అతిధులు ద్వారా సిస్టర్ సుమలత అందజేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి చిన్నారులను అభినందించారు. ఆనందభరిత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.

# గుంతల రోడ్డులకు మరమ్మత్తులు చేపట్టాలి సిపిఐ డిమాండ్....




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాజపేట మండలంలోని రఘునాథపురం నుంచి పొట్టిమర్రి వరకు వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారి ప్రయాణికులకు ఇబ్బందిగా మారినదని మరమ్మతులు చేపట్టాలని చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం డిమాండ్ చేశారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో బుధవారం ప్రజల సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, తాగునీటి సమస్య, రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రజలు కోరినట్లు ఆయన తెలిపారు. రఘునాథపురం గ్రామం నుండి దూదివెంకటాపురం, గౌరాయపల్లి, పొట్టిమర్రి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి రాజయ్య, ఎండి దస్తగిరి, కర్నాటి రాజేష్, చెన్న శ్రీనివాస్, వడ్లకొండ బాలస్వామి, రఘునాథపురం కమ్యూనిస్టు పార్టీ నాయకుడు ఎండి దస్తగిరి, కర్నాటి రాజేష్, చెన్న శ్రీనివాస్, వడ్లకొండ బాలస్వామి, పాల్గొన్నారు. పార్టీని ఆదరించి విరాళాలు పలువురు అందజేశారు.

# బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్న సట్టు శరత్ చంద్ర



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రానికి చెందిన సట్టు శరత్ చంద్ర జిల్లా వైద్య శాఖలో జూనియర్ అసిస్టెంట్గా చక్కటి విధులు నిర్వర్తిస్తూ అందరి ప్రశంసలతో పాటు ప్రత్యేక అవార్డు అందుకున్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని జిల్లాస్థాయిలో వైద్యశాఖలో బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మనోహర్ బెస్ట్ అవార్డు ప్రశంస పత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాలుగవ తరగతి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ జిల్లా వైద్య శాఖలోని అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు. శరత్ చంద్ర ను అభినందించారు.

# మాజీ సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలభిషేకం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
కాళేశ్వరం వాటర్ తో యాదగిరిగుట్ట మండలం గౌరయిపల్లి గ్రామంలో చెరువు అలుగు దుకడం తో మాజీ సీఎం కేసీఆర్ చిత్ర పటానికి గౌరయిపల్లి బిఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో పాలభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అద్యక్షులు అత్మూరి ఐలయ్య, మాజీ సర్పంచ్ సిరికొండ సత్యనారాయణ, మాధవరెడ్డి, వార్డ్ మెంబర్ దుబ్బ సాయికుమార్, పల్లపు టీంపు వెంకటేష్, హరినాథ్ రెడ్డి, భాస్కర్, స్వామి, సత్యనారాయణ, వెంకటేష్, కనకయ్య, ఐలయ్య, శ్రీను, మురారి, భాస్కర్, రాజు, బీరప్ప, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, నారాయణఖేడ్ :**
తెలంగాణ శాసనసభలో బుధవారం జరిగిన పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ (పి యూ సి ) సమావేశంలో తెలంగాణ పబ్లిక్ అండర్ టేకింగ్ మెంబర్ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు, ఆర్థిక నిర్వహణ మరియు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఆయా సంస్థలు చేపట్టిన ప్రాజెక్టులపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలు మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పని చేయాలని సూచించారు. ప్రజల సొమ్ము సద్వినియోగం అయ్యేలా చూడటంతో పాటు, ఆయా సంస్థలు లాభాల బాటలో నడిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులతో కలిసి చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో పబ్లిక్ అండర్ టేకింగ్ సంస్థల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు తెలంగాణ రాష్ట్ర పలు శాఖల అధికారులు సహచర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# పన్నీరు నర్సింహులు కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేసిన బీజేపీ నాయకులు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
ఆలేరు మండలం తూర్పుగూడెం గ్రామంలో బీజేపీ కార్యకర్త పన్నీరు నర్సింహులు అకస్మాత్తుగా మరణించడం జరిగింది. నర్సింహులు కుటుంబానికి బీజేపీ పార్టీ ఆలేరు పట్టణ మరియు మండల అధ్యక్షులు పూజారి కుమారస్వామి గౌడ్, నంద గంగేష్ ఆదేశానుసారం మండల జనరల్ సెక్రెటరీ శేషత్వము అమరేందర్ మరియు మండల కార్యదర్శి బైరి మహేందర్ గౌడ్ పన్నీరు నర్సింలు కుటుంబానికి ఆర్థిక సాయం కింద 50 కేజీల బియ్యం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తూర్పుగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు గజరాజుల శంకర్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు బండి రాములు, మండల ఉపాధ్యక్షుడు సూదగాని సురేష్, బిజెవైఎం నాయకులు చంద్రగిరి మహేష్, కొరికొప్పుల మనోహర్, గజరాజుల శివ, కొత్త శేఖర్, అందే కరుణాకర్, ఏంద్రు వెంకటేష్, అందె అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి సమన్వయ

## పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు

**కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎమ్మెల్యేలు ,ఎంపీలు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ, కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాద్రి జిల్లా ఎమ్మెల్యేలు కొత్తగూడెం ఎమ్మెల్యే భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కొత్తగూడెం ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రాంసహాయం. రఘురాం రెడ్డి, మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యులు శ్రీ పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను అందజేయాలని ఉద్దేశంతో దిశ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామీణ ప్రాంతలు అభివృద్ధి కొరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాని అభివృద్ధి పథంలో నడిపే విధంగా సహకరించాలని ప్రజా ప్రతినిధులు, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో, అత్యాచార చట్టాలపై ఎం.ఎన్.ఆర్ ఉన్నత పాఠశాల, ఫసల్వాదిలో అవగాహన కార్యక్రమం

**సంగారెడ్డి భరోసా బృందం ద్వారా విద్యార్థులకు చట్ట నిబంధనలు, భద్రతపై అవగాహన**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, సంగారెడ్డి ప్రతినిధి:** జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ ఆదేశానుసారం, ఏప్రిల్-08 బుధవారం సంగారెడ్డి జిల్లా ఫసల్వాది ఎం.ఎన్.ఆర్ ఉన్నత పాఠశాలలో భరోసా కో-ఆర్డినేటర్, సిబ్బంది పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పోక్సో చట్టంలోని ముఖ్య నిబంధనలు, నేరాలకు విధించే శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు. పోక్సో అత్యాచార కేసులలో భరోసా కేంద్రం యొక్క పాత్ర, అందించే సేవలు గురించి అవగాహన కల్పించారు.విద్యార్థులు చిన్నప్పటి నుండి పెద్ద గోల్స్ పెట్టుకొని, గోల్స్ సాదించేలా రోజువారీ ప్లాన్ ఉండాలనై సూచించారు. యవ్వన దశలో కలిగే ఆకర్షణలు, సోషల్ మీడియా వల్ల కలిగే దుష్ప్రభావాలు, విద్య యొక్క అవసరం వంటి అంశాలపై కూడా విద్యార్థులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మారియా నాతన్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరైన మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆలేరు మున్సిపల్ 10 వ వార్డులో బుధవారం రోజు జంగిటి శ్రీధర్ మహాలక్ష్మి దంపతులు ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరై వారి దంపతులకు ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య సహకారంతో నూతన వస్త్రాలు అంధజేసిన 10 వ వార్డు కౌన్సిలర్ మల్లెల సరిత శ్రీకాంత్, ఆలేరు మున్సిపల్ వైస్ ఛైర్మెన్ అంగడి ఆంజనేయులు, ఈ కార్యక్రమంలో ఆలేరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎంఎ ఎజాస్, కోపరేటివ్ డైరెక్టర్ కట్టేగుమ్ముల సాగర్ రెడ్డి, కౌన్సిలర్స్ వానరసి మరియమ్మ మార్క్, పస్థం ఆంజనేయులు, జూకంటి సంపత్, జెట్ట నీరజ సిద్దులు, బయ్య జ్ఞానేందర్, పాము శివ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక దందాపై రెవెన్యూ యంత్రాంగం కఠిన చర్యలు

**83 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసిన తహసిల్దార్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం లో అక్రమ ఇసుక దందాపై రెవెన్యూ యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. బూర్గంపహాడ్ మండలంలో తహసీల్దార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో భారీగా అక్రమ ఇసుక నిల్వలను అధికారులు గుర్తించి సీజ్ చేశారు.

**వివరాల్లోకి వెళితే...**
బూర్గంపహాడ్ గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 40 ట్రాక్టర్ ఇసుక ట్రిప్పులు, నాగినేనిప్రోలు గ్రామంలో నిల్వ చేసిన మరో 43 ట్రాక్టర్ ట్రిప్పులు కలిసి మొత్తం 83 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్యల్లో రెవెన్యూ శాఖతో పాటు మైనింగ్ శాఖ, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయడం విశేషం. సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వం ఆదాయంగా మార్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఏప్రిల్ 9, 2026 (గురువారం) ఉదయం 11:00 గంటలకు బూర్గంపహాడ్ మండలంలోనే ప్రజా వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అధికారిక ప్రకటనలో తెలిపారు.ఈ వేలం ప్రక్రియలో పాల్గొనాలనుకునే ప్రజలు, వ్యాపారులు అందరూ హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పారదర్శకంగా, నిబంధనల ప్రకారం వేలం జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు.అక్రమ ఇసుక రవాణా, నిల్వలపై కఠిన హెచ్చరికలు జారీ చేసిన తహసీల్దార్."ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలించినా,




నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తప్పవు. ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి వారిని ఉపేక్షించము" అని ఘాటుగా హెచ్చరించారు.

**స్థానిక ప్రజల్లో చర్చనీయాంశం**
ఈ భారీ సీజ్ చర్య మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అక్రమ దందాపై ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన వైఖరికి ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

# ఐలాపూర్ భూముల్లో హైడ్రాకు అడుగుపెట్టే హక్కు లేదు

**న్యాయవాది ముఖీమ్ ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశము**

**పాల్గొన్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ**

**అమీన్‌పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08 :** బడుగు బలహీనవర్గాల భూములపై కన్నేసిన రేవంత్ సర్కార్ హైడ్రా పేరుతో దోపిడీకి పాల్పడుతుందనిన్యాయవాది ముఖిమ్ అన్నారు.

**హైడ్రాపై ధ్వజమెత్తిన న్యాయవాది ముఖీమ్**
మాకు అనుకూలమైన డిక్రీ ఉందని రెవెన్యూ అధికారులు,హైడ్రా అధికారులు ఐలాపూర్ భూములలో ప్రవేశించే హక్కు లేదన్నారు. ఐలాపూర్ భూముల్లో హైడ్రా అధికారులు తమ వాహనాలతో నిత్యం తిరుగుతూ గ్రామస్తులను ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ముఖీమ్ ఆరోపించారు. కోర్టు పరిధిలో ఉన్న ఐలపూర్ భూములపై డ్రోన్ల ద్వారా నిఘా పెట్టిన అమీన్ పూర్ రెవెన్యూ అధికారుల చర్యలను ఖండిస్తున్నామని తెలిపారు. సంవత్సరం క్రితం ఐలాపూర్ రాజగోపాల్ నగర్ పేరుతో నూతనంగా ఏర్పడిన సొసైటీ హైడ్రా అధికారి రంగనాథ్ తో కలిసి ఐలాపూర్ భూములలో భారీ భూకుంభకోణానికి తెరలేపినట్లు తమకు విశ్వసనీయ సమాచారం ఉందని

**త్వరలోనే ఆ గుట్టు రట్టు చేస్తామని ముఖీమ్**
ఐలాపూర్ భూముల వ్యవహారంలో రిట్ అప్పీల్ పెండింగ్ ఉందని రిట్ అప్పీల్ ద్వారా హైడ్రా అధికారులు ఐలపూర్ భూముల్లోకి ప్రవేశించకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ హైడ్రా అధికారి రంగనాథ్ జోక్యం తగదని హైడ్రా తన నిబంధనలకు లోబడి పనిచేయాలని సూచించారు.

గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎవరూ హైడ్రాకు భయపడవద్దని న్యాయస్థానాలు మనకు రక్షణ కవచంలా ఉన్నాయని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఐలాపూర్ భూముల రైతుల పక్షాన గళం వినిపించేందుకు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఐలాపూర్ భూముల వ్యవహారంలో హైడ్రా, రెవెన్యూ అధికారులు నిబంధనలకు అనుగుణంగా సంయమనంతో పనిచేసే విధంగా ఆయా శాఖలను కట్టడి చేయాలని గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేయకుండా కేసులు తుది తీర్పు వచ్చేంతవరకు రైతులను ఇబ్బంది పెట్టకుండా వ్యవహరించే విధంగా ఆదేశాలు ఇవ్వాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు. కోర్టు పరిధిలో లేని వివాదాస్పదం కాని భూముల వ్యవహారంలోకి హైడ్రా, రెవెన్యూ, రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకోవద్దని ఎమ్మార్పీఎస్ తరఫున విజ్ఞప్తి, సూచన చేశారు.రైతులకు ఉండే చట్టబద్ధమైన హక్కులను హైడ్రా కాలరాయొద్దని ఆ భూములలో వ్యవసాయం, నిర్మాణాలు



చేసుకునే హక్కులు వారికి ఉంటాయని ప్రభుత్వాన్ని ఉద్దేశించి రైతుల తరఫున హితవు పలికారు.
హైడ్రా పరిధిని ప్రశ్నిస్తూ నిబంధనలకు అనుగుణంగా ఈ సంస్థ పని చేస్తుందా లేదా అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేయాలని కోరారు. హైడ్రా తన పరిధి మించి వ్యవహరిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో దానిని అరికట్టే బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిధిలో ఉన్నదని అన్నారు. హైడ్రా తన పరిధిని విస్మరించి వ్యవహరించదానికి రాష్ట్ర ప్రభుత్వం వెన్నంటి ఉన్నదని వినిపిస్తున్న ఆరోపణలకు అవకాశం ఇవ్వకుండా పారదర్శకతను నిరూపించుకునే అవసరం ఎంతైనా ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి మందకృష్ణ మాదిగ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐలాపూర్ రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాలుష్యం మాకు.. రోగాలు మాకూ.. అభివృద్ధి మీకా..

**సిఎస్ఆర్ నిధుల తరలింపు పైన పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆగ్రహం**

**స్థానిక పరిశ్రమల సీస్సార్ నిధులు స్థానిక అభివృద్ధి పనులకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతి**

**నిధులు కేటాయించని పక్షంలో ప్రజా ఉద్యమం..**

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08 :** ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని పరిశ్రమల సిఎస్ఆర్ నిధులను స్థానిక అభివృద్ధి పనుల కోసం కేటాయించాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రావిణ్యకు వినతి పత్రం అందించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. పచ్చటి పొలాలు.. మూడు పంటలు పండే భూములు.. స్వచ్ఛమైన గాలి.. అందమైన తమ పల్లెల పరిధిలో అభివృద్ధి కోసం నూతన పరిశ్రమలు ఏర్పాటు అయితే తమ గ్రామాలు అభివృద్ధి చెందడంతో పాటు స్థానికంగా ఉపాధి లభిస్తుందన్న కొంగత్త ఆశలతో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలు 70వ దశకంలో పరిశ్రమల ఏర్పాటునకు స్వాగతం పలికారని అన్నారు.పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఇస్నాపూర్, పాశమైలారం, పటాన్చెరు, జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం, కాజీపల్లి, కిష్టాయపల్లి, బొల్లారం, గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి, గుమ్మడిదల, అమీన్పూర్ మండల పరిధిలోని సుల్తాన్పూర్, గండి గూడెం, దయరా గ్రామాల పరిధిలో వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ప్రధానంగా బల్క్ డ్రగ్స్ పరిశ్రమలతో పాటు కెమికల్స్, మెడిసిన్స్, పెస్టిసైడ్స్ కంపెనీలు ఏర్పాటయ్యాయని తెలిపారు.పటాన్చెరు నియోజకవర్గ కాలుష్య పరిస్థితులపై సుప్రీంకోర్టు సైతం జస్టిస్ మిగతా కమిషన్ ఏర్పాటు చేసి.. ప్రత్యేక నివేదిక తప్పించుకుంది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ రంగరాజన్ సైతం స్వయంగా నియోజకవర్గంలో పర్యటించి కాలుష్య పరిస్థితులను తెలుసుకున్నారని పేర్కొన్నారు.
సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2016లో చెన్నైలోని జాతీయ




హరిత ట్రిబ్యునల్ కాలుష్య నివారణ అంశంపై కీలక ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.కాలుష్యం మూలంగా వ్యాధులకు గురవుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తో పాటు.. ఇస్నాపూర్ పెద్ద చెరువు, గండిగూడెం, ఆసాని కుంట, కిష్టారెడ్డిపేట చెరువుల పరిధిలో సీవరేజ్ ట్రీట్మెంట్ సైతం ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.
నియోజకవర్గ పరిధిలోని బల్క్ డ్రగ్స్ పరిశ్రమలు ప్రతి సంవత్సరం తమ లాభాల్లో 0.5 శాతం డబ్బులు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక అకౌంట్లో జమ చేసి.. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహణకు ఆదేశాలు సైతం జారీ చేసిందన్నారు.2023 లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ పరిశ్రమలు అందిస్తున్న సి.ఎస్.ఆర్ నిధులను స్థానికంగా ఖర్చు చేయకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారని వివరించారు. నీళ్లు నిధులు నియామకాలు అన్న అంశంతో ఏర్పాటైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో.. స్థానిక నిధులు స్థానికంగా ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.ప్రతి రోజు కాలుష్య జలాలు.. విష వాయువులతో జీవనం కొనసాగిస్తున్న పటాన్చెరు నియోజకవర్గ ప్రజలకు పరిశ్రమలు అందిస్తున్న సి ఎస్ ఆర్ నిధుల ద్వారా వివిధ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నాము. గత రెండున్నర సంవత్సరాలుగా సి ఎస్ ఆర్ నిధులు లేకపోవడం మూలంగా అభివృద్ధి కుంటూ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే స్పందించి పటాన్చెరు నియోజకవర్గం నుండి చెల్లిస్తున్న సి ఎస్ ఆర్ నిధులను స్థానికంగా ఖర్చు పెట్టాలని.. లేని పక్షంలో ప్రజల నిరసనను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, దశరథ్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## అజ్మీరా శ్యామ్ నాయక్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
ఆసిఫాబాద్ నియోజక వర్గం నార్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామంలో మంగళవారం సాయంత్రం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక సర్పంచ్ సంతోష్ తో కలిసి ఆయన ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా శ్యామ్ నాయక్ మాట్లాడుతూ, నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ గూడు కల్పించాలన్న ధ్యేయంతో ప్రభుత్వం పని చేస్తోందని, అర్హులైన ప్రతి పేదవాడికి ఈ పథకం కింద న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం సకాలంలో ప్రభుత్వం విడుదల చేస్తుందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. నిర్మాణ పనుల్లో ఏవైనా ఇబ్బందులు ఎదురైనా లేదా సాంకేతిక సమస్యలు ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రాథోడ్. శంకర్ నాయక్, నాయకులు సంతోష్, వెంకటేష్ మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సిరోల్‌లో ఎరువుల దుకాణాలపై ఆకస్మిక దాడులు - అధిక నిల్వలతో పార్వతి ఫర్టిలైజర్ సీజ్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, మహబూబాబాద్ ప్రతినిధి :**
డోర్నకల్ నియోజకవర్గం సిరోల్ మండలంలో వ్యవసాయ శాఖ అకస్మికంగా తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలపై చర్యలు చేపట్టింది. మండల వ్యవసాయ విస్తరణ అధికారి (ఏవో) చాయ రాజ్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు కఠినంగా సాగాయి. మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను పరిశీలించిన అధికారులు, చింతపల్లి గ్రామంలోని పార్వతి ఫర్టిలైజర్ దుకాణంలో ప్యారో కాట్ డైక్లోరేట్ గడ్డి మందు అధికంగా నిల్వ ఉంచిన విషయాన్ని గుర్తించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా నిల్వలు ఉండటంతో వెంటనే ఆ దుకాణాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, సీజ్ చేసిన దుకాణంలో ఉన్న సరుకులను 60 రోజులపాటు విక్రయించకుండా నిషేధం విధించినట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన మరియు సరైన పరిమితిలో ఉత్పత్తులు అందేలా ఈ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా అన్ని ఎరువుల దుకాణాలు నిబంధనలు పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

# జర్నలిస్ట్ భైరి విశ్వనాథం గౌడ్ ను ఘనంగా సన్మానించిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం దక్షిణ కాశి కొలనుపాక కోమట్ల మఠం వాసవి కన్యకా పరమేశ్వరి సైత నగరేశ్వర స్వామి ఆలయంలో సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జర్నలిస్ట్ భైరి విశ్వనాథం గౌడ్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ప్రొద్దుటూరి రమేష్ గుప్తా చేతుల మీదుగా జర్నలిస్ట్ భైరి విశ్వనాథం గౌడ్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి, బజ్జూరి రవీందర్ గుప్తా, దిడిగం వీరయ్య గుప్తా, నంగునూరు కృష్ణమూర్తి గుప్తా, మిరియాల ఉమేష్ గుప్తా, కాశెట్టి శ్రవణ్ కుమార్ గుప్తా, దిడిగం అంజయ్య గుప్తా, కస్తూరి అంజయ్య గుప్తా, దిడిగం సంతోష్ గుప్తా, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# డోర్నకల్‌లో అభివృద్ధి జోరు

## 11వ వార్డులో మౌలిక వసతుల పనులు శరవేగంగా, ప్రజల ప్రశంసలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా 11వ వార్డులో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు బుధవారం వేగంగా కొనసాగుతూ ప్రాంతానికి కొత్త రూపు తీసుకువస్తున్నాయి. స్థానిక కౌన్సిలర్ కేశబోయిన సంధ్య వెంకటేష్ ఆధ్వర్యంలో సుమారు 533 మీటర్ల సిసి రోడ్, 1100 మీటర్ల సైడ్ కాలువ పనులు పురోగమిస్తున్నాయి. ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న కౌన్సిలర్‌పై స్థానికులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజాసేవలో నిమగ్నమవుతున్నారని కొనియాడుతున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని, ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి, 11వ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు కూడా అభివృద్ధి పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, మున్ముందు కూడా ఇదే విధంగా అభివృద్ధి కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు.

# డోర్నకల్ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించిన యువ నాయకుడు

## సీరోల్‌లో ఘనంగా భూపాల్ నాయక్ జన్మదిన వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, మహబూబాబాద్ ప్రతినిధి :**
డోర్నకల్ నియోజకవర్గంలో అతి తక్కువ కాలంలోనే ప్రజల మనస్సుల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన యువ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త, కిసాన్ పరివార్ వ్యవస్థాపకుడు నానావత్ భూపాల్ నాయక్ జన్మదిన వేడుకలు సీరోల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విష్ణు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించగా, మండల కోఆర్డినేటర్ ధరంసోత్ రాంమూర్తి నాయక్ నేతృత్వంలో మన్నే గూడెం గ్రామపంచాయతీలో గ్రామస్తుల సమక్షంలో కేక్ కట్ చేసి భూపాల్ నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డోర్నకల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపించే సత్తా కలిగిన నాయకుడు నానావత్ భూపాల్ నాయక్ అని పేర్కొన్నారు. రైతులను రాజులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రజల మధ్యకి వచ్చిన ఈ యువ నాయకుడికి తమ పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. గ్రామస్థులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన వేడుకలను మరింత ఉత్సాహంగా నిర్వహించారు.

# 21వ రోజు ఉయ్యాల వేడుకలో 'దీక్షిత' నామకరణ

## యువ జర్నలిస్టు కుటుంబంలో ఆనందోత్సాహాలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, మహబూబాబాద్ ప్రతినిధి:**
ఖమ్మం నగరానికి చెందిన యువ జర్నలిస్టు నల్లమాస్ మహేష్ - లావణ్య కుమారి దంపతులకు రెండో సంతానంగా కుమార్తె జన్మించిన విషయం తెలిసిందే. పాపకు 21 రోజులు పూర్తయ్యిన సందర్భంగా, ఖమ్మం జిల్లా తిరుమలయపాలేం మండలం జూపేడ గ్రామంలో బుధవారం సంప్రదాయ పద్ధతిలో నామకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారిని ఉయ్యాలో వేసి కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో 'దీక్షిత' అనే పేరు పెట్టారు. ఉయ్యాల వేడుక ఆనందోత్సాహాల నడుమ కన్నుల పండుగలా జరిగింది చిన్నారి దీక్షితను కుటుంబ సభ్యులు పలువురు ఆశీర్వదించారు.

# కాగజ్‌నగర్ బీజేపీ పట్టణ అధ్యక్ష పదవికి శివకుమార్ రాజీనామా



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షులు కె. శివకుమార్ తన పదవికి రాజీనామా చేశారు. భారత సైన్యంలో సేవలందించిన అనంతరం పంచాయతీ సెక్రటరీగా పనిచేసిన, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చూసి ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించినట్లు తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, కార్యకర్తల అభ్యున్నతికి కృషి చేశానని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో వచ్చిన రాజకీయ ఒత్తిడులు, సవాళ్లను ఎదుర్కొన్నానని తెలిపారు. అయితే కొన్ని అనివార్య కారణాలు, సంస్థాగత లోపాల నేపథ్యంలో రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అయినా పార్టీ ప్రాథమిక సభ్యత్వంలో కొనసాగుతూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు సహకరించిన జిల్లా నాయకత్వం, కార్యకర్తలు, పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు

# రాలపేట రైల్వే బ్రిడ్జి పనుల్లో ప్రమాదం

## కార్మికులకు గాయాలు, నిర్లక్ష్యంపై ఆగ్రహం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, ఆసిఫాబాద్ జిల్లా :**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ సమీపంలో రాలపేట రైల్వే బ్రిడ్జి వద్ద థర్డ్ లైన్ పనుల్లో బుధవారం మధ్యాహ్నం ప్రమాదం జరిగింది. అసిఫాబాద్ రోడ్--సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్ల మధ్య గిర్డర్ అమర్చే సమయంలో జాక్ ఫెయిల్ కావడంతో అది వంగిపడి కార్మికులు గాయపడ్డారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన రవి బసాక్‌ను మెరుగైన చికిత్సకు తరలించగా, కన్నయ్య చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యాడు. మిగిలిన వారికి ప్రాథమిక చికిత్స అందించారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, రక్షణ పరికరాల లేమి కారణంగానే ప్రమాదం జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, గాయపడిన వారికి ఉచిత వైద్యం, నష్టపరిహారం అందించాలని సీపీఎం నాయకుడు ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. 48 గంటల్లో చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి హోజ





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి ప్రతినిధి:**
**పోషకాహారం, హాజరు పై దృష్టి:**
యాదాద్రి భువనగిరి జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి హోజ బీబీనగర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు 5, 6తో పాటు రామునిగుండ్ల తండాను సందర్శించారు. సందర్శన సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార నిల్వలను పరిశీలించిన ఆమె, పిల్లల హాజరు శాతాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు ఆరోగ్య లక్ష్మీ పథకం ద్వారా అందిస్తున్న భోజనాన్ని సక్రమంగా వినియోగిస్తున్నారా అనే అంశంపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రీస్కూల్ విద్యా కార్యక్రమాల నిర్వహణపై టీచర్లతో చర్చించి, పిల్లలతో ముచ్చటించారు. రామునిగుండ్ల తండా సర్పంచ్‌తో మాట్లాడి స్థానిక సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. అలాగే నిర్మాణంలో ఉన్న చిల్డ్రన్స్ హోమ్, సఖి సెంటర్ భవనాలను పరిశీలించి పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నరసింహరావు, సీ.డి.పి.ఓ శైలజ, సూపర్వైజర్లు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు


# వన్యప్రాణుల గుర్తింపుకు విద్యార్థి రోబో

**తండ్రి కోసం రోబోను తయారు చేసిన కొడుకు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వినూత్న ప్రయత్నం**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వన్యప్రాణుల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో స్థానికుల్లో భయం నెలకొంది. ఈ సమస్యకు పరిష్కారంగా బెజ్జూరు మండలానికి చెందిన 10వ తరగతి విద్యార్థి ఆశ్రిత్ వినూత్న రోబోను రూపొందించాడు. అల్ట్రాసోనిక్ సెన్సార్, కెమెరాతో పనిచేసే ఈ రోబో వన్యప్రాణుల కదలికలను గుర్తించి, జంతువు జీవించి ఉందా, చనిపోయిందా అనేదాన్ని తెలియజేస్తుంది. అర్డినో టెక్నాలజీతో పనిచేసే ఈ పరికరం సుమారు రూ.7,500 ఖర్చుతో తయారైంది. అటవీ శాఖకు టైగర్ ట్రాకింగ్‌లో ఈ రోబో ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. భవిష్యత్తులో లైవ్ డేటా అందించేలా అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థి లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇప్పటికే పేటెంట్ కోసం దరఖాస్తు చేసిన ఈ ఆవిష్కరణకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆలేరు పట్టణంలో గల అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలేరు మున్సిపల్ వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, ఆలయ నిర్వహణ అధ్యక్షులు మొరిగాడి వెంకటేష్, మరియు కౌన్సిలర్లు మల్లెల సరితా శ్రీకాంత్, యాట శివ, కోమల్ల మౌనిక హరీష్, బోట్ల సంపత్, వట్టిపల్లి శ్రీనివాస్, పాము శివ తదితరులు పాల్గోన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చల్లూరులో హెల్త్ క్యాంప్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం రాజపేట మండలం చల్లూరు గ్రామంలో హెల్త్ క్యాంప్ జరిగింది ఈ క్యాంపును గ్రామ సర్పంచ్ భీమగాని రూప బాల నరసయ్య ప్రారంభించారు. బిపి, షుగర్, క్యాన్సర్, టీబీ వారికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సేఫ్ మదర్ హుడ్ కార్యక్రమం ను పురస్కరించుకొని గర్భిణీ స్త్రీలకు సురక్షిత మాతృత్వము, నవజాతశిశు సంరక్షణ గురించి . డాక్టర్, మోసెస్ రాజ్, హెచ్ఈఓ భీకు నాయక్, అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొంత సుధాకర్ హెల్త్ అసిస్టెంట్ ఉపేందర్, కలకుంట్ల కవిత, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజపేట మండలానికి ఏడు ఐకెపి సెంటర్లు మంజూరు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలానికి ఏడు ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరి అయినట్లు ఏపీఎం మురారి తెలిపారు. రఘునాథపురం, నమిల, దూది వెంకటాపురం, పారుపల్లి, జాల, బసంతాపురం, సింగారం, గ్రామాలు ఎంపికైనట్లు చెప్పారు.

# రైతులకు కేంద్రం తీపి కబురు.. సబ్సిడీకి మోడీ సర్కార్ గ్రీన్ సిగ్నల్

**ఖరీఫ్ ఎరువులకు రూ.41,543 కోట్ల సబ్సిడీ.**
**జైపూర్ మెట్రో ఫేజ్-2 మరియు రాజస్థాన్ భారీ రిఫైనరీ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, నేషనల్ :** దేశంలోని రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు పెరిగినా ఆ భారం రైతులపై పడకుండా కేంద్రమే భరించేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఖరీఫ్ సీజన్ లో పీ అండ్ కే ఎరువుల రాయితీకి కేంద్ర కేబినెట్ ఆమోద ముద్రవేసింది. ఇవాళ ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో సెంట్రల్ కెబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించిన మంత్రిమండలి నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ నిర్ణయాలను మంత్రి అశ్వనీకుమార్ వైష్ణవ్ మీడియాకు వెల్లడిస్తూ పీ అండ్ కే ఎరువులకు రూ. 41,543 కోట్ల రాయితీకి కేబినెట్ ఆమోద ముద్రవేసిందని పేర్కొన్నారు. అలాగే రూ. 13 వేల కోట్లతోయ జపుర మెట్రో ప్రాజెక్టు రెండో దశకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించారు.

**రాజస్థాన్‌లో భారీ రిఫైనరీ:**
భారతదేశ ఇంధన రంగంలో మరో కీలక మైలురాయిగా నిలవనున్న రాజస్థాన్ రిఫైనరీ ప్రాజెక్టుపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. హెచ్‌పీసీఎల్ రాజస్థాన్ రిఫైనరీ లిమిటెడ్ ప్రాజెక్టుకు సంబంధించిన ఈక్విటీ భాగస్వామ్యం మరియు ప్రాజెక్టు వ్యయ సవరణలపై స్పష్టతనిచ్చారు. ఈ రిఫైనరీలో వాణిజ్య కార్యకలాపాలు జూలై 2026 నుండి కార్యాకలాపాలు ప్రారంభించబోతున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద రిఫైనర్‌గా అవతరించిందని మన ప్రస్తుత రిఫైనింగ్ సామర్థ్యం ఏడాదికి 258 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా అదనంగా మరో 9 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం పేరుగుతుందని పేర్కొన్నారు.

## కనికి గ్రామపంచాయతీ పల్లె పకృతి వనంలో

# చెట్లు విక్రయం ఆరోపణలు అవాస్తవవం!

**తీవ్రంగా ఖండించిన, కనికి గ్రామసర్పంచ్**
**అన్ని ఆధారాలతో నిరూపిస్తాం : కనికి గ్రామపంచాయతీ కార్యదర్శి**
**క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహిస్తాం : కౌటాల ఎంపీడీవో ప్రసాద్**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం కౌటాల మండలపరిధిలోని కనికి గ్రామపంచాయతీ లోని పల్లె పకృతి వనం పరి రక్షణ కోసం ఉన్న చెట్లను గ్రామస్తులకు తెలియకుండా గ్రామపంచాయతీ తీర్మానం చేయకుండా గ్రామ సర్పంచ్ మరియు కార్యదర్శి కుమ్మకై ఇష్టాను సారంగా పల్లె పకృతి వనం లో ఉన్న చెట్లను విక్రయించారాని గ్రామస్తులు ఎంపీడీఓ కారాలయం ఎదుట నిరసన తెలిపారు. గ్రామస్తులు చెసిన ఆరోపణలో నిజం లేదని అవాస్తవం అని గ్రామసర్పంచ్ తీవ్రంగా ఖండించారు. అనవసరంగా మాపై కక్ష్యతో లేనిపోని ఆరోపణలు చేయడం మానుకొని గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామపంచాయతీ అనుమతులతో పల్లె పకృతి వనం లోని చెట్లను విక్రయించమని నా స్వంత ఆస్తి కాదని అందరి ఆస్తి అని గ్రామాభివృద్ధి కోసమే చెట్లను విక్రయించమని, గ్రామపంచాయతీలో గ్రామస్తులు, వార్డు సభ్యులు అందరికితెలియపరిచి గ్రామ సభ నిర్వహించి తీర్మానం చెసి గ్రామభివృద్ధి కై పల్లె పకృతి వనం చెట్లను విక్రయించాలని తీర్మానం గ్రామస్తుల సమక్షం లో తీర్మానించారు. ఇట్టి తీర్మానం తో చెట్లను విక్రయించమని తెలిపారు. గ్రామపంచాయతీలో విధులు చేయకుండా గ్రామాభివృద్ధికి అడ్డుకుంటున్న, ఆరోపణలు, చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, పరువు నష్టం క్రింద ఉన్నత అధికారులకు పిర్యాదు చేస్తానని అన్నారు. పల్లె పకృతి వనం చెట్ల విక్రయం పై కనికి గ్రామసర్పంచ్ ను చరవాణి ద్వారా వివరణ కోరగా, గ్రామపంచాయతీకి నిధులు తక్కువ వస్తున్నందున గ్రామాన్ని అభివృద్ధి చెయలేక పోతున్నామని గ్రామభివృద్ధికై, గ్రామపంచాయతీలో గ్రామ సభ నిర్వహించి తీర్మానం చేసి గ్రామపంచాయతీ అనుమతులతో గ్రామభి వృద్ధి కైపల్లె పకృతి వనం చెట్లను విక్రయించమని, కార్యదర్శిని వివరణ కోరగా గ్రామసభ తీర్మానం ఉన్నదని, గ్రామపంచాయతీ అనుమతులతో చెట్లను విక్రయించారాని అన్నారు. ఎం పీ డీ ఓ ను చరవాణి ద్వారా వివరణ కోరగా పల్లె పకృతి వనం చెట్లను విక్రయము చేసారని నా దృష్టికి రాలేదని అన్నారు. నిబంధనలకు, చట్టావిరుద్దంగా వ్యవహారించారాని, పల్లె పకృతివనం చెట్లను విక్రయించడం ప్రొసీజేర్ ప్రకారం వేలం పాట నిర్వహించాలని, తెలిపారు. ఇట్టి విషయం పై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి బాద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమం లో వార్డు మెంబెర్స్, ఓంప్రకాష్ ఉపసర్పంచ్, గంధం చంద్రకళ, పసుల కమల, అమృత, సోయం చంద్రకళ, భాగ్యలక్ష్మి, గ్రామస్తులు బీమయ్య, పోషం, డోనయ్య, రతన్, రాజేశ్వర్, బిక్షపతి. తదితరులు పాల్గొన్నారు.

## కోమాలో ఉన్న నా భర్త వీర్యం సేకరించేందుకు

# అనుమతి ఇవ్వండి.. హైకోర్టుకు మహిళ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08 :** కోమాలో ఉన్న తన భర్త ద్వారా బిడ్డను కనేలా అతడి వీర్యాన్ని సేకరించి, భద్రపరిచేందుకు అనుమతి ఇవ్వాలి ఓ మహిళ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. అరుదైన ఈ ఘటనకు సంబంధించిన ఉదంతం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ వ్యక్తి 2025 మార్చి నుంచి కోమాలో ఉండగా అతడికి ఐసీయూలో వెంటిలేటర్ సపోర్ట్ పై చికిత్స అందిస్తున్నారు. అతడు కోలుకునే అవకాశాలు తక్కువగా ఉన్నాయని వైద్యులు చెప్పారు. ఈ నేపథ్యంలో తన భర్త ద్వారా తాను తల్లిని కావడానికి తన భర్త వీర్యాన్ని సేకరించి భద్రపరచుకోవాలని సదరు మహిళ భావించింది. కానీ నిబంధనల ప్రకారం సంతానోత్పత్తి చికిత్సలకు భార్యాభర్తలిద్దరి పరస్పర అంగీకరం తప్పనిసరి. కానీ ఇక్కడ భర్త అపస్మారక స్థితిలో ఉండటం వల్ల ఆయన అంగీకారం తెలపడం అసాధ్యం. ఈ నేపథ్యంలో కోర్టును ఆశ్రయించిన భార్య తన భర్త వీర్యం ఇంకా సజీవంగా ఉన్నప్పుడే దానిని సేకరించి భద్రపరచాలని కోర్టును కోరింది. ఆలస్యం జరిగితే వీర్యం నాణ్యత దెబ్బతింటుందని, తద్వారా ఆమె తల్లి కావాలనే ఆశలు శాశ్వతంగా అడుగంటుతాయని ఆమె తరపు న్యాయవాది అరిజిత్ గౌర్ కోర్టుకు విన్నవించారు.

**కోర్టు నిర్ణయంపై ఉత్కంఠ:**
అయితే తన అభ్యర్థనను పరిష్కరించడానికి, భర్త ప్రస్తుత వైద్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నమూనాను సేకరించి భద్రపరచడం సాధ్యమేనా? సురక్షితమేనా అని నిర్ధారించడానికి ఒక నిపుణుల వైద్య మండలిని ఏర్పాటు చేయాలని పిటిషనర్ ప్రతిపాదించారు. సర్జికల్ స్పెర్మ్ కలెక్షన్ లేదా సర్జికల్ స్పెర్మ్ రిట్రీవల్ అని పిలువబడే ఈ ప్రక్రియలో, ఒక సన్నని సూదిని ఉపయోగించి వృషణాల నుండి వీర్యాన్ని వెలికితీస్తారని ఐ.వి.ఎఫ్ నిపుణులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ తరపు న్యాయవాది ఆయుష్ గౌర్ ఈ కేసును అత్యంత క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ సున్నితమైన అంశంపై (ఏప్రిల్ 09) విచారణ జరగనుంది. ఢిల్లీ హైకోర్టు ఇచ్చే తీర్పు ఇలాంటి మరిన్ని కేసులకు మార్గదర్శకంగా నిలవనుంది.

# నాలుగు మండలాలకు పీఎన్‌జీ గ్యాస్ సరఫరా వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లాలో భువనగిరి, బీబీనగర్, చౌటుప్పల్, వలిగొండ మండలాలకు పైప్‌లైన్ ద్వారా గృహ వినియోగదారులకు పీఎన్‌జీ గ్యాస్ సరఫరా అందించేందుకు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. బుధవారం మినీ మీటింగ్ హాల్‌లో జిల్లారెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, అడిషనల్ ఎస్పీ లక్ష్మినారాయణతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీఎన్‌జీ అమలు పురోగతిని పరిశీలించారు. జిల్లాలో నాలుగు మండలాల్లో గ్యాస్ పైప్‌లైన్ ద్వారా గృహాలకు సురక్షితంగా, నిరంతర సరఫరా అందించేందుకు చేపడుతున్న పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా పైప్‌లైన్ పనులు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగాలని, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ, మున్సిపల్, గ్రామపంచాయతీ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, పనుల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్ల తవ్వకాలు, డ్రైనేజీ, మరమ్మత్తుల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ పనులు నిర్వహించాలని, పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, సిటీ గ్యాస్ ప్రతినిధులు రమేష్, వంశీ, జిల్లా పౌర సరఫరాల అధికారి రోజారాణి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, తహసీల్దార్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విషతుల్యమైన స్నాక్స్ తయారీ.. పక్కా ప్లాన్‌తో పోలీసుల మెరుపు దాడి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, మెయిన్ డెస్క్:** ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న నగరంలోని ఓ నకిలీ స్నాక్స్ తయారీ కేంద్రాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో, హానికరమైన రసాయనాలతో తినుబండారాలు తయారు చేస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో హెచ్ - ఫాస్ట్ బృందం సోదాలు చేపట్టింది. మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని ఓ కంపెనీలో 'కరాచీ పోలో', 'రింగ్ లైట్' పేర్లతో ఎలాంటి అనుమతులు లేకుండా స్నాక్స్‌ను తయారు చేస్తున్నారు. అయితే, ఈ తయారీ కేంద్రంలో కనీస శుభ్రత పాటించకపోవడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో వీటిని సిద్ధం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

**ప్రమాదకర రసాయనాల వినియోగం..**
అయితే, ఈ స్నాక్స్ తయారీలో తక్కువ ధరకే లభించే నాసిరకం నూనెలు, విషతుల్యమైన రంగులు వాడుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. అధికారులు దాడి చేసిన సమయంలో అక్కడ నిల్వ ఉన్న భారీ ఎత్తున స్టోర్ చేసిన స్నాక్స్, యంత్రాలను సైతం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపి నిర్వాహకులను అదుపులోకి తీసకుని విచారిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి లాభాలే ధ్యేయంగా పనిచేస్తున్న ఇటువంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# భారతీయులకు గండం.! కేంద్రం రెడ్ అలర్ట్. రంగంలోకి భారత ఎంబసీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, న్యూఢిల్లీ:** పశ్చిమ ఆసియాలో యుద్ధ జ్వాలలు ఎప్పుడు ఎగిసిపడతాయో తెలియని ఉత్కంఠ భరిత పరిస్థితుల నడుమ, ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం బుధవారం (ఏప్రిల్ 8) అత్యంత కీలకమైన 'అడ్వైజరీ' జారీ చేసింది. అక్కడ ఉన్న భారతీయ పౌరులందరూ "వీలైనంత త్వరగా" దేశాన్ని విడిచి వెళ్లిపోవాలని గట్టిగా సూచించింది.ఏప్రిల్ 7న ఇచ్చిన హెచ్చరికను మరింత తీవ్రతరం చేస్తూ, ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. భారత పౌరులు తమ ఇష్టానుసారం అంతర్జాతీయ భూ సరిహద్దులను దాటడానికి ప్రయత్నించవద్దని ఎంబసీ హెచ్చరించింది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు ఉన్నందున, రాయబార కార్యాలయాన్ని సంప్రదించిన తర్వాతే వారు సూచించిన సురక్షిత మార్గాల ద్వారా దేశం దాటాలని కోరింది. ఎంబసీతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, అధికారిక హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది. ఈ మేరకు ప్రత్యేక మొబైల్ నంబర్లు మరియు ఈమెయిల్ హెల్ప్‌లైన్‌లను కూడా భారతీయుల కోసం సిద్ధం చేసింది.

కాల్పుల విరమణ ఉన్నా.. తగ్గని టెన్షన్!
అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు వార్తలు వస్తున్నప్పటికీ, భారత ప్రభుత్వం మాత్రం దాన్ని పూర్తిస్థాయి శాంతిగా పరిగణించడం లేదు. సరిహద్దుల్లో సైనిక కదలికలు, అంతర్గత అనిశ్చితి భారతీయుల ప్రాణాలకు ముప్పు తెచ్చే అవకాశం ఉందని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. అందుకే, విమాన సర్వీసులు లేదా అందుబాటులో ఉన్న రవాణా మార్గాలను ఉపయోగించుకుని త్వరితగతిన స్వదేశానికి చేరుకోవాలని భారతీయులను కోరుతోంది.దేశం కాని దేశంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్న వేలాది మంది భారతీయ కార్మికులు, విద్యార్థులు మరియు పర్యాటకులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడమే ఇప్పుడు భారత ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాలు.

# మల్లికార్జున ఖర్గే 'గుజరాత్' వ్యాఖ్యల వివాదం.. క్షమాపణలు కోరిన కాంగ్రెస్ అధినేత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08 :** కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా దుమారం రేపాయి. గుజరాత్ ప్రజల అక్షరాస్యతను ఉద్దేశించి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో దేశవ్యాప్తంగా ఉన్న గుజరాతీలు మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మలను దహనం చేశారు. అలాగే ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తన వ్యాఖ్యలపై స్పందించారు. తన మాటల వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే అందుకు తాను మనస్ఫూర్తిగా విచారం వ్యక్తం చేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. తన ప్రసంగంలోని కొన్ని భాగాలను రాజకీయ లబ్ధి కోసం కావాలనే తప్పుగా చిత్రీకరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గుజరాత్ ప్రజల పట్ల తనకు ఎప్పుడూ అత్యంత గౌరవం ఉందని, వారిని తక్కువ చేసి మాట్లాడటం తన ఉద్దేశం కాదని ఆయన స్పష్టం చేశారు.

అసలేం జరిగింది?
గత ఆదివారం కేరళలోని ఇడుక్కిలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఖర్గే మాట్లాడుతూ.. కేరళ ప్రజలు విద్యావంతులని, వారు మోడీ మాటలకు మోసపోరని వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో గుజరాత్ వంటి ప్రాంతాల్లోని "అక్షరాస్యులు కాని వారిని" ప్రధాని సులభంగా నమ్మించవచ్చని ఆయన పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. గుజరాత్ అస్తిత్వాన్ని, ప్రజల తెలివితేటలను ఖర్గే అవమానించారని, ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. ఈ ఒత్తిడి నేపథ్యంలో ఖర్గే సోషల్ మీడియా వేదికగా తన వివరణ ఇస్తూ వివాదానికి ముగింపు పలికే ప్రయత్నం చేశారు

# హోటల్‌కు పిలిపించి మైనర్ బాలుడిపై వివాహిత అఘాయిత్యం.!

**ఛత్తీస్‌గఢ్‌లో దారుణం! మైనర్ బాలుడిపై వివాహిత లైంగిక దాడి.**

**ఏప్రిల్ 1న హోటల్‌లో అఘాయిత్యం. పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, ఛత్తీస్‌గఢ్ :** ఓ మహిళా సోషల్ మీడియాలో పరిచయం అయిన మైనర్ బాలుడిని హోటల్ కి పిలిచి.. అఘాయిత్యం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఛత్తీస్‌గఢ్‌లోని కవర్ధా జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న ఈ వింతైన కేసు స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన ఒక మైనర్ బాలుడిని హోటల్‌కు పిలిపించుకుని, ఒక వివాహిత మహిళ అతనిపై లైంగిక దాడికి పాల్పడింది. సిటీ కొత్వాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడైన మైనర్ బాలుడికి, సదరు మహిళకు కొంతకాలం క్రితం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ద్వారా పరిచయం ఏర్పడింది. అది కాస్తా స్నేహంగా మారడంతో, వారు అప్పుడప్పుడు మాట్లాడుకునేవారు. ఈ క్రమంలోనే ఏప్రిల్ 1, 2026న ఆ మహిళ బాలుడిని కలవడానికి స్థానిక హోటల్‌కు పిలిపించింది.బలవంతం చేయడంతో హోటల్ గదిలోకి చేరుకున్న బాలుడిపై సదరు మహిళ ఒత్తిడి తెచ్చి లైంగిక దాడికి పాల్పడింది. అంతేకాకుండా, ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని, సోషల్ మీడియాలో వివరాలు బయటపెడతానని బాలుడిని భయపెట్టి బెదిరించింది. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన ఆ బాలుడు చివరికి తన కుటుంబ సభ్యులకు జరిగిందంతా వివరించాడు. బాధితుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఏప్రిల్ 3న పోలీసులు నిందితురాలిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితురాలిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, మైనర్లపై ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. కాగా వారం రోజుల క్రితం ఈ ఘటన చోటు చేసుకోగా తాజాగా వెలుగులోకి వచ్చి.. సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# యాదగిరిగుట్ట దేవస్థానంలో ఎస్పీఎఫ్ సిబ్బంది స్వచ్ఛ భారత్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి ప్రతినిధి:** టీజీ ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లాక్రా ఆదేశాల మేరకు, యాదగిరిగుట్ట ఆలయ భద్రతా విభాగం సిబ్బంది బుధవారం కొండ పైనుండి వైకుంఠ ద్వారం మెట్ల దారి వరకు 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ కె. శేషగిరి రావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సేకరించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా సురక్షితంగా తరలించారు. ఈ స్వచ్ఛ భారత్ సేవలో ఎస్ఐ రవి, ఏఎస్ఐలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




# వేసవిలో నీటి ఎద్దడికి చెక్... రూ. 88 లక్షల యాక్షన్ ప్లాన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన జిల్లా కలెక్టర్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి ప్రతినిధి:** వేసవికాలంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సమ్మర్ యాక్షన్ ప్లాన్--2026లో భాగంగా రూ. 88.15 లక్షల అంచనాలతో ప్రత్యేక ప్రణాళికకు ఆమోదం తెలిపారు.ఈ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రైతుల నుండి అద్దె బోర్లు వినియోగించడం, తాత్కాలిక పైప్‌లైన్ల ఏర్పాటు, బోర్‌వెల్‌ల ఫ్లషింగ్ మరియు డీపెనింగ్ వంటి పనులను తక్షణమే చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమాల అమలుకు మిషన్ భగీరథ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ పి. కరుణాకరన్‌కు బాధ్యతలు అప్పగించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఐకెపి సెంటర్ మంజూరి చేయించిన విప్ బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు చెప్పిన సర్పంచ్, రైతులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం** బసంతాపురం గ్రామంలో నూతనంగా ఐకెపి సెంటర్ మంజూరి అయిందని, అందుకు కృషి చేసిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కి బసంతపురం గ్రామ సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి, రైతులు, ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్ల తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో బసంతపురం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం లేనందువలన రైతులు తమ పండించిన దాన్యమును ఇతర గ్రామాలకు తీసుకెళ్లి అమ్ముకోవడం చాలా ఇబ్బందులు కలిగాయని, కొంతమంది ప్రైవేట్ వ్యాపారస్తులకు అమ్ముకోవడంతో రైతులు మోసపోవడం జరిగిందన్నారు. రైతుల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని గ్రామంలో ఐకెపి సెంటర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేని కోరడంతో వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వడ్ల కొనుగోలు కేంద్రం మంజూరు చేయించారని చెప్పారు. రైతులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కురవిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆతిథ్యమిచ్చిన మార్త భద్రయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1977 - 78 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు కురవిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. అదే బ్యాచ్ కు చెందిన మార్త చకినాల భద్రయ్య ఆతిథ్యం అందించారు. భద్రయ్య దంపతులు తోటి స్నేహితులకు స్వాగతం పలికి ఆయన సొంత ఫంక్షన్ హాల్ లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. చదువుకున్న సమయంలో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువుల గుర్తుచేసుకొని వారి సేవలను కొనియాడారు. కలసి భోజనాలు చేశారు. మొదటగా కురవి లోని శ్రీ వీరభద్ర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం లో పాల్గొన్న విద్యార్థులందరూ ఆనందం వ్యక్తం చేశారు. ఆతిథ్యమిచ్చిన భద్రయ్య దంపతులకు కృతజ్ఞతలు చెప్పారు.

## మీ చర్మం ఈ లక్షణాలను తెలియజేస్తుందా.. అయితే కారణం ఏమిటో తెలుసుకోండి..



చర్మం ఆరోగ్యానికి అద్దంలాంటిదని వైద్యులు తరచూ చెబుతుంటారు. సాధారణంగా కనిపించే కొన్ని చర్మ మార్పులు తాత్కాలికమైనవైనా, కొన్ని సందర్భాల్లో అవి శరీరంలో జరుగుతున్న అంతర్గత సమస్యలకు సంకేతాలుగా ఉండవచ్చు. ఇతర లక్షణాలు బయటపడకముందే చర్మం కొన్ని హెచ్చరికలను ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల చర్మంపై కనిపించే అసాధారణ లేదా దీర్ఘకాలిక మార్పులను గమనించడం చాలా ముఖ్యం. మెడ, కుచ్చులు లేదా తొడల మధ్య భాగంలో నలుపు రంగులో, మందంగా, వెల్వెట్‌లా కనిపించే మచ్చలు ఉంటే అది అకాంథోసిస్ నిగ్రికాన్స్ లక్షణం కావచ్చు. ఈ పరిస్థితి సాధారణంగా ఇన్సులిన్ రెసిస్టెన్స్‌తో సంబంధం కలిగి ఉంటుంది. ఇది టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని సూచిస్తుంది. కొన్ని సందర్భాల్లో హార్మోన్ల అసమతుల్యత లేదా ఊబకాయం కారణంగా కూడా ఇది ఏర్పడుతుంది.

**దద్దుర్లు లేని దురద..**

చర్మం లేదా కళ్లలో పసుపు రంగు కనిపిస్తే అది జాండిస్ సంకేతం కావచ్చు. ఇది రక్తంలో బిలిరుబిన్ పెరగడం వల్ల జరుగుతుంది. సాధారణంగా ఇది హెపటైటిస్ వంటి కాలేయ సమస్యలు, బైల్ డక్ట్ అడ్డంకులు లేదా రక్త సంబంధిత వ్యాధులతో సంబంధం కలిగి ఉంటుంది. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరం. అలాగే ఎలాంటి దద్దుర్లు లేకుండానే నిరంతరంగా దురద ఉంటే అది కూడా అంతర్గత సమస్యలకు సంకేతం కావచ్చు. ముఖ్యంగా క్రానిక్ కిడ్నీ డిసీజ్ లేదా కాలేయ సమస్యలు ఉన్నవారిలో ఈ లక్షణం కనిపించవచ్చు. శరీరంలో విషపదార్థాలు పేరుకుపోవడం వల్ల ఈ దురద వస్తుంది. తరచూ కారణం లేకుండా మచ్చలు పడటం లేదా రక్తస్రావం జరగడం గమనిస్తే అది రక్తం గడ్డకట్టే ప్రక్రియలో లోపాలను సూచించవచ్చు. కొన్ని సందర్భాల్లో ఇది ల్యూకేమియా వంటి తీవ్రమైన వ్యాధుల లక్షణంగా కూడా ఉండవచ్చు. చిన్న చిన్న ఎరుపు లేదా ఊదా మచ్చలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు.

**చర్మం తెల్లగా లేదా నీలం రంగులో ఉంటే..**

చర్మం పలుచగా తెల్లగా లేదా నీలం రంగులోకి మారడం కూడా ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు. తెల్లగా కనిపించడం అనీమియా సూచనగా ఉండొచ్చు. రక్తంలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గినప్పుడు చర్మం లేదా పెదవులు నీలంగా మారుతాయి. ఇది గుండె లేదా ఊపిరితిత్తుల సమస్యలతో సంబంధం కలిగి ఉండవచ్చు. అలాగే అకస్మాత్తుగా రాషెస్, గడ్డలు లేదా నొప్పిగా ఉండే ముద్దలు కనిపిస్తే అవి ఆటోఇమ్యూన్ లేదా ఇన్‌ఫ్లమేటరీ వ్యాధులకు సంకేతం కావచ్చు. ముఖ్యంగా కాళ్లపై ఎరుపు రంగులో నొప్పిగా ఉండే గడ్డలు ఇన్ఫెక్షన్లు లేదా ఇతర సమస్యలను సూచించవచ్చు.

**హానికరం కాకపోయినా..**

చర్మ మార్పులు చాలా సందర్భాల్లో హానికరం కాకపోవచ్చు. అయితే అవి అకస్మాత్తుగా కనిపించడం, కొన్ని వారాల పాటు కొనసాగడం లేదా అలసట, జ్వరం, బరువు తగ్గడం వంటి ఇతర లక్షణాలతో కలిసి కనిపిస్తే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి. చర్మం శరీరంలో జరుగుతున్న మార్పులకు ముందస్తు సంకేతాలను ఇస్తుంది. పసుపు రంగు, అసాధారణ మచ్చలు, నిరంతర దురద, కారణం లేని గాయాలు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సమయానికి పరీక్షలు చేయించుకోవడం ద్వారా తీవ్రమైన వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స పొందవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.

## అంజీరా పండ్లు తింటే ఆ సమస్యలకు చక్కటి పరిష్కారం లభిస్తుంది తెలుసా..?

ప్రకృతి ప్రసాదాలైన పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వాటిలో ఏ పండు ప్రత్యేకత దానిదే. దేని ప్రయోజనాలు దానివే. అదేవిధంగా అంజీర పండ్ల (ూఅయివవతీఖ టతీబఱం) ప్రత్యేకత అంజీర పండ్లకే ఉన్నది. అంజీర పండ్లు లేదా అత్తి పండ్లను ప్రతిరోజూ తినడంవల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా ఎండిన అత్తి పండ్లను నానబెట్టి తినాలని వైద్యులు సిఫారసు చేస్తున్నారు. ఇలా తినడంవల్ల రక్తం ఉత్పత్తి పెరిగి, బలహీనత తొలగిపోతుందని చెబుతున్నారు. అంజీరా పండ్లతో ఇంకా ఎలాంటి లాభాలు ఉన్నాయో తెలుసుకుందాం..మలబద్ధకం సమస్యతో చాలామంది ఇబ్బంది పడుతుంటారు. సాధ్యమైనంత త్వరగా ఈ సమస్య తగ్గాలంటే రోజూ నానబెట్టిన అత్తిపండ్లను తినాలి. అత్తి పండ్లలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది ప్రీ బయోటిక్‌లా పనిచేస్తుంది. రోజూ అంజీరా తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మల విసర్జన సులభమవుతుంది.అంజీర పండ్లలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తపోటు నియంత్రణకు తోడ్పడుతుంది. ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్స్ కూడా పుష్కలంగా ఉంటాయి. చర్మ ఆరోగ్యానికి అవసరమైన విటమిన్‌లు సి, ఇ, ఎ కూడా దీనిలో ఉన్నాయి. అందేరూ అంజీర పండ్లు చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. దీనివల్ల చర్మం యవ్వనంగా, ప్రకాశవంతంగా కనిపిస్తుంది.ఎముకలను పరిపుష్టం చేయడానికి కూడా అంజీర పండ్లు తోడ్పడుతాయి. నానబెట్టిన అత్తిపండ్లలో క్యాల్షియం, ఫాస్పరస్ ఎక్కువగా ఉండటంవల్ల ఎముకలు దృఢంగా తయారవుతాయి.నానబెట్టిన అత్తి పండ్లను తినడంవల్ల శరీరంలో ఆక్సిడేషన్ ఒత్తిడి తగ్గుతుంది. డయాబెటిస్ ఉన్నవారు వీటిని కొద్ది మొత్తంలో తినవచ్చు. వీటివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు కూడా తగ్గుతాయి. అయితే వీటిలో ఉండే తీపి కారణంగా చాలామంది డయాబెటిస్ రోగులు వీటిని తినేందుకు భయపడతారు. కానీ రోజుకు ఒకట్రెండు తినడంవల్ల ఎలాంటి సమస్యా ఉండదని నిపుణులు చెబుతున్నారు.స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉన్నవారు ప్రతిరోజు పాలలో నానబెట్టిన అంజీర పండ్లను తినడంవల్ల మేలు జరుగుతుంది. ఇలా చేయడంవల్ల వారిలో స్పెర్మ్ కౌంట్ పెరుగుతుంది. కాబట్టి స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండటంవల్ల సంతానలేమి సమస్యతో బాధపడుతున్న వారికి ఇది చక్కటి పరిష్కారంగా చెప్పవచ్చు.సాధారణంగా చిన్న పిల్లలు, మహిళలు ఎక్కువగా రక్తహీనత సమస్యతో బాధపడుతుంటారు. అలాంటి వారు ప్రతిరోజు అంజీర పండ్లను తినడంవల్ల ప్రయోజనం ఉంటుంది. రక్తం ఉత్పత్తి పెరిగి రక్తహీనత సమస్య తగ్గుతుంది.మహిళలు రుతుస్రావానికి ముందు, హార్మోన్‌ల మార్పుల సమయంలో అత్తిపండ్లను తినడం మంచిది.అదేవిధంగా మెనోపాజ్ దశలో అత్తిపండ్లు తినడంవల్ల అనేక రుతు సంబంధ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. కాబట్టి మెనోపాజ్ దశకు దగ్గరలో ఉన్నవాళ్లు అంజీర పండ్లను తినడం అలవాటు చేసుకోవా

## జాగ్రత్త.. కరివేపాకు అందరికీ మంచిది కాదు..!



ఇంటర్నెట్ డెస్క్: కరివేపాకు భారతీయ వంటకాల్లో తప్పనిసరిగా వాడే సుగంధ ద్రవ్యం. ఇది రుచిని పెంచడమే కాకుండా, విటమిన్, కాల్షియం, ఐరన్ వంటి పోషకాలతో కూడిన అద్భుతమైన ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. జుట్టు ఆరోగ్యం, జీర్ణక్రియను మెరుగుపరచడం, డయాబెటిస్ నియంత్రణకు ఇది ఎంతో సహాయపడుతుంది. అయితే, ఇది అందరికీ మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**చక్కెర స్థాయిలు తక్కువగా ఉన్నవారికి:**

కరివేపాకు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. మధుమేహ రోగులకు ఇది ఉపయోగకరంగా ఉండగా, ఇప్పటికే చక్కెర స్థాయి తక్కువగా ఉన్నవారు అధికంగా తీసుకోవడం వల్ల హైపోగ్లైసీమియా (రక్తంలో చక్కెర తక్కువ అవడం) సమస్యలు రావచ్చు. దీనివల్ల తల తిరగడం, శక్తి తగ్గడం వంటి లక్షణాలు కలగవచ్చు.

అలర్జీ సమస్యలు ఉన్నవారికి:

కొంతమందికి కొన్ని మసాలాలు లేదా మూలికల వల్ల అలర్జీలు వస్తాయి. అదే విధంగా, కరివేపాకు వల్ల కూడా కొందరికి చర్మంపై వాపు, శ్వాస సమస్యలు తలెత్తవచ్చు. అలాంటి సందర్భంలో దీనిని ఉపయోగించకూడదు.

**గర్భిణీలు, పాలిచ్చే తల్లులు:**

గర్భధారణ సమయంలో శరీరం హార్మోన్ల మార్పులకు సున్నితంగా ఉంటుంది. కరివేపాకు రసం లేదా అధిక మొత్తంలో పొడిని తీసుకుంటే వాంతులు, జీర్ణ సమస్యలు రావచ్చు. కాబట్టి మితంగా తీసుకోవడం మంచిది.

**జీర్ణ సమస్యలు ఉన్నవారికి:**

కరివేపాకు సాధారణంగా జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది, కానీ అల్సర్ లేదా ఇతర జీర్ణాశయ సమస్యలు ఉన్నవారు పచ్చి ఆకులను నేరుగా తినడం వల్ల సమస్యలు ఎదుర్కొనే అవకాశముంది.

మూత్రపిండాల సమస్యలు ఉన్నవారికి:

మూత్రపిండాల వ్యాధి ఉన్నవారు లేదా డయాలసిస్ తీసుకుంటున్నవారు ఏదైనా ఔషధ మొక్కను అధిక మోతాదులో తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం అవసరం. కరివేపాకు ఆరోగ్యకరమైనది అయినప్పటికీ, కొన్ని పరిస్థితుల్లో జాగ్రత్తగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## పిండి పదార్థాలను తినడం పూర్తిగా మానేస్తే ఏమవుతుంది..?



కార్బోహైడ్రేట్లు శరీరానికి ప్రధాన శక్తి వనరు. రోజువారీ పనులను చేయడానికి అవసరమైన ఎనర్జీని ఇవే అందిస్తాయి. వీటిని తీసుకున్నప్పుడు అవి మొదట జీర్ణవ్యవస్థలో విచ్ఛిన్నమై గ్లూకోజ్‌గా మారి రక్తంలో కలుస్తాయి. దీనినే బ్లడ్ షుగర్ అని అంటారు. తర్వాత శరీరం ఇన్సులిన్‌ను విడుదల చేసి ఆ గ్లూకోజ్‌ను కణాలకు చేరవేసి శక్తిగా ఉపయోగిస్తుంది. అదనంగా ఉన్న గ్లూకోజ్‌ను కాలేయం, కండరాల్లో నిల్వ చేస్తుంది. అవి కూడా నిండిపోయినప్పుడు, మిగిలిన గ్లూకోజ్‌ను కొవ్వుగా మారుస్తుంది. అందువల్ల పిండి పదార్థాలను అధికంగా తీసుకుంటే బ్లడ్ షుగర్ పెరగడం, ఫ్యాట్ నిల్వ కావడం జరుగుతుంది. ఈ కారణాలతోనే చాలా మంది కార్బ్స్ (పిండి పదార్థాలు) తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే కార్బ్స్‌ను పూర్తిగా మానేయడం లేదా చాలా తక్కువగా తీసుకోవడం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు చూపే అవకాశం ఉంది. శరీరం తక్షణ గ్లూకోజ్‌పై ఆధారపడటం నుంచి కొవ్వును శక్తిగా ఉపయోగించే విధానానికి మారుతుంది. ఈ మార్పు వల్ల కొన్ని లాభాలు ఉన్నప్పటికీ, కొన్ని దుష్ప్రభావాలు కూడా కనిపించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

**శరీరంలోని శక్తి నిల్వ గ్లైకోజెన్..**

కాలేయం, కండరాల్లో కార్బోహైడ్రేట్లు గ్లైకోజెన్ రూపంలో నిల్వ ఉంటాయి. ప్రతి గ్రాము గ్లైకోజెన్‌తో సుమారు మూడు గ్రాముల నీరు కూడా నిల్వ ఉంటుంది. కార్బ్స్ తగ్గించినప్పుడు ఈ నిల్వలు ఒకటి నుంచి రెండు రోజుల్లో తగ్గిపోతాయి. దీనివల్ల మొదట బరువు త్వరగా తగ్గినట్లుగా అనిపిస్తుంది. కానీ ఇది నీటి కోత కారణంగా జరుగుతుంది. నీటి లోపం వల్ల డీహైడ్రేషన్ వచ్చే ప్రమాదం ఉంది. అలాగే ఈ దశలో ఎనర్జీ కూడా తగ్గుతుంది. గ్లైకోజెన్ నిల్వలు తగ్గిన తర్వాత శరీరం కొవ్వు నుంచి కీటోన్స్‌ను ఉత్పత్తి చేయడం ప్రారంభిస్తుంది. దీనిని కీటోసిస్ అంటారు. ఈ దశలో శరీరం కొవ్వును ప్రధాన శక్తిగా ఉపయోగిస్తుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అయితే ప్రారంభంలో కీటో ఫ్లూ అని పిలిచే లక్షణాలు కనిపిస్తాయి. అలసట, మలబద్ధకం, నిద్రలేమి వంటి సమస్యలు వస్తాయి. మెదడు ఎక్కువగా గ్లూకోజ్‌ను ఉపయోగిస్తుంది. కానీ కార్బ్స్ తగ్గించినప్పుడు మొదటి వారంలో ఏకాగ్రత లోపం, మతిమరుపు, చిరాకు వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీనినే బ్రెయిన్ ఫాగ్ అంటారు. అయితే రెండు వారాల తర్వాత శరీరం కీటోన్స్‌ను సరిగ్గా వినియోగించడం నేర్చుకుంటుంది. దీంతో మళ్లీ మెదడు పనితీరు మెరుగవుతుంది.

**ఈ సమస్యలు వచ్చే అవకాశం..**

కార్బ్స్ తగ్గించడం వల్ల బ్లడ్ షుగర్ స్థాయిలు స్థిరంగా ఉంటాయి. ఇన్సులిన్ సున్నితత్వం మెరుగవుతుంది. దీనివల్ల ఆకలి తగ్గి, స్వీట్ తినాలనే కోరిక కూడా తగ్గుతుంది. దీర్ఘకాలంలో డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. అయితే గ్లైకోజెన్ తగ్గడం వల్ల నీరు, ఎలక్ట్రోలైట్స్ కూడా తగ్గిపోతాయి. దీంతో కండరాల్లో నొప్పులు, ముడుచుకోవడం, క్రాంప్స్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా రాత్రిపూట లేదా వ్యాయామం సమయంలో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. అందుకే పొటాషియం, మెగ్నీషియం ఉన్న ఆహారం తీసుకోవడం అవసరం. ఇక కార్బ్స్ తగ్గించడం వల్ల ఇన్సులిన్ స్థాయిలు తగ్గి, ౧ాజుూ వంటి సమస్యల్లో కొంత ఉపశమనం లభిస్తుంది. అయితే ఒక్కసారిగా కార్బ్స్‌ను ఎక్కువగా తగ్గిస్తే కార్టిసోల్ పెరిగి ఒత్తిడి పెరగవచ్చు. దీని ప్రభావంగా జుట్టు రాలడం, నిద్ర సమస్యలు రావచ్చు. థైరాయిడ్ పనితీరు కూడా కొంత మందగించవచ్చు. కార్బోహైడ్రేట్స్ ను తగ్గించడం మంచిదే అయినప్పటికీ వీటిని పూర్తిగా మానేయడం కన్నా సమతుల్యంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## లింగ నిర్ధారణ నిషేధంపై కఠిన చర్యలు : పి.సి అండ్ పి.ఎన్.డి.టి సమీక్ష సమావేశం

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రీ--కన్సెప్షన్ ఉ ప్రీ--నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ చట్టం--1994 (పి.సి అండ్ పి.ఎన్.డి.టి చట్టం) అమలుపై జిల్లా స్థాయి సలహా కమిటీ (డిఎల్ఎసి) సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. ఎం. మనోహర్ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్ మినీ హాల్, రాయగిరిలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో చట్టపరమైన నిబంధనల అమలు, ఆరోగ్య సంస్థల పనితీరు, రికార్డుల నిర్వహణ, సేవల నాణ్యతపై విస్తృతంగా చర్చించి సమీక్షించారు. అల్ట్రాసౌండ్ కేంద్రాలు, జన్యు పరీక్ష కేంద్రాల నమోదు, పునరుద్ధరణ, వార్షిక తనిఖీలు, చట్ట ఉల్లంఘనలపై తీసుకున్న చర్యలు, పెండింగ్ అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. అన్ని నమోదిత కేంద్రాలు చట్ట నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. ముఖ్యంగా లింగ నిర్ధారణ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని, ఎటువంటి ఉల్లంఘనలు జరగకుండా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పి.సి అండ్ పి.ఎన్.డి.టి ప్రోగ్రాం అధికారి డా. యల్. యశోద, డా. ఇందిరామణి (గైనకాలజీ విభాగాధిపతి), డా. జ్యోతి, డా. శ్రీదేవి, డా. నిర్మల (పిల్లల వైద్య నిపుణులు), డా. సుమన్ కళ్యాణ్ (డిప్యూటీ డిఎం ఉహెచ్ఓ), జిల్లా పబ్లిక్ రిలేషన్స్ అధికారి అరుంధతి, డా. ప్రమీల (సఖి ఎన్జీఓ), శివలింగం (యాత్ర ఎన్జీఓ), నాగరాజు (స్కీడ్ ఎన్జీఓ), చి. సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు




Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.